మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు
# ప్రజా మంటలు
సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 92 వెల - రూ 5:00
తెలంగాణ జాతీయ దినపత్రిక
Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు
Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



# హెరిటేజ్ సిటీగా వరంగల్ అభివృద్ధి

**వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయండి - ఔటర్ రింగ్ రోడ్డుకు ప్రతిపాదనలు**

**వరంగల్ పర్యటనలో అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష**






వరంగల్,జూన్29 (ప్రజా మంటలు):

వరంగల్ అభివృద్ధికి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. వరంగల్ పర్యటనలో ఉన్న ఆయన నగర అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. హెరిటేజ్ సిటీగా తీర్చిదిద్దటానికి ప్రణాళిక రూపొందించా లన్నారు. ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్డుకు భూసేకరణ పూర్తి చేయాలని, దానికి అవసరమైన నిధుల వివరాలు ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు. హైవేలను అనుసంధానిస్తూ వరంగల్ ఔటర్ రింగ్‌రోడ్డు ఉండేలా చూడాలన్నారు. ఓఆర్ఆర్ నుంచి టెక్స్‌టైల్ పార్కును అనుసంధానించాలని చెప్పారు. స్మార్ట్‌సిటీలో భాగంగా భూగర్భ డ్రైనేజీ అభివృద్ధి చేయాలని, నాలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించిన ఆయన.. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. హెరిటేజ్ సిటీగా వరంగల్

మిగతా 2లో..

## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వ్యయం పెంపు

**నిబంధనలకు విరుద్ధంగా అనుమతులపై సీఎం ఆగ్రహం**

**మౌఖిక ఆదేశాలతో ఎలా పెంచుతారని రేవంత్ ప్రశ్న**

**గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశం**

వరంగల్,జూన్29 (ప్రజా మంటలు):

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం విషయంలో ఇష్టారీతిన అంచనా వ్యయం పెంచడంపై అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రూ.1100 కోట్లున్న అంచనా వ్యయాన్ని రూ.1726 కోట్లకు ఎలా పెంచారని సీఎం ప్రశ్నించారు. కేవలం మౌఖిక ఆదేశాలతో రూ.626 కోట్ల వ్యయం ఎలా పెంచుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతా 2లో..





# కాంగ్రెస్ అభివృద్ధిలో కీలక భూమిక

**రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేసిన నేత**

## డిఎస్ మృతికి సిఎం రేవంత్ సంతాపం



హైదరాబాద్,జూన్29 (ప్రజా మంటలు):

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షునిగా పనిచేసిన డీఎస్.. కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీకి ఆయన విశిష్ట సేవలను అందించారన్నారు. సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన డీఎస్ రాజకీయ నేతలెందరికో ఆదర్శంగా నిలిచారని స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలోనూ, కాంగ్రెస్ రాజకీయ ప్రస్థానంలో ఆయన తన ప్రత్యేక ముద్రను చాటుకున్నారని గుర్తుచేసుకున్నారు. డీ శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ భావజాలాన్ని తెలుగు రాష్ట్రాల్లో విస్తరింప జేసిన కీలక నేతల్లో డీ.శ్రీనివాస్ ఒకరని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. డీఎస్ మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. పీసీసీ అధ్యక్షుడిగా డీఎస్ సేవలు గుర్తు చేసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్?, వారి కుటుంబసభ్యులకు భగవంతుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షునిగా పని చేసిన డీఎస్ కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీకి ఆయన విశిష్ట సేవలను అందించారని అభిప్రాయపడ్డారు. సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన డీఎస్ రాజకీయ నేతలెందరికో ఆదర్శంగా నిలిచారని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. డీఎస్ మృతిపట్ల మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహా, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంతాపం

మిగతా 2లో..

# ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం

**తెలంగాణకు భారీ వర్ష సూచన**



హైదరాబాద్,జూన్29 (ప్రజా మంటలు):

ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుంది. అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ వెల్లడించింది. రెండ్రోజుల పాటు తెలంగాణలో మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని వెల్లడించింది. పలు జిల్లాలకు వర్షాల నేపథ్యంలో ఎల్లో అలర్ట్ జారీ చేసింది. నేడు, రేపు హైదరాబాద్‌లో తేలికపాటి వర్షాలకు ఛాన్స్ ఉందని తెలిపింది. కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం,కొత్తగూడెం, వికారాబాద్ సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి..ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది. బలమైన/ స్థిరమైన ఉపరితల గాలులు రాష్ట్రంలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలలో వీచే అవకాశం ఉంది.అల్పపీడనం, రుతుపవనాలు చురుగ్గా మారడంతో ఉత్తర కోస్తాకు భారీ వర్ష సూచన చేసింది వాతావరణశాఖ.. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. గంటకు 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది? మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారుల సూచనలు చేశారు. రానున్న రెండు రోజులు ఏపీలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ చెబుతుంది.

# కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ గడువు పొడిగింపు

**మరో రెండు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**



హైదరాబాద్,జూన్ 29 (ప్రజా మంటలు):

కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ గడువును మరో రెండు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, బ్యారేజీలపై విచారణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నెలతో పీసీ ఘోష్ కమిషన్ గడువు పూర్తికానుంది. విచారణ కొనసాగుతోన్న నేపథ్యంలో గడువును ఆగస్టు 31 వరకు పొడిగించింది. కమిషన్ ముందు విచారణకు హాజరైన ప్రాజెక్టుకు సంబంధించిన మాజీ ఈఎన్సీలు, ప్రస్తుత ఈఎన్సీలు, సీఈలు, ఇతర ఇంజినీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను పూర్తి వివరాలతో అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ నెల మొదటి వారంలో నిర్వహించిన విచారణ సందర్భంగా జస్టిస్ పీసీ ఘోష్ ఆదేశించారు. దీంతో గురువారం వరకు 60 మంది సీల్డ్ కవర్లలో అఫిడవిట్లు దాఖలు చేసినట్లు తెలిసింది.

## తెలంగాణ అవసరాల మేరకే

# విద్యుత్ ఒప్పందాలు

**నిబంధనలకు లోబడే అవగాహన**

**జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌కు జగదీశ్‌రెడ్డి లేఖ**




హైదరాబాద్,జూన్29 (ప్రజా మంటలు):


భారాస హయాంలో నిర్మించిన విద్యుత్ ప్లాంట్లు, విద్యుత్ కొనుగోళ్ల విషయంపై విచారణ జరుపుతోన్న జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి లేఖ రాశారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో ఉన్న విద్యుత్ అవసరాలు, దక్షిణాది రాష్ట్రాల మధ్య నెలకొన్న పోటీ వాతావరణం దృష్టిలో పెట్టుకొని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో నాటి రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుందని పేర్కొన్నారు. 2003 కేంద్ర ప్రభుత్వ విద్యుత్ చట్టం ప్రకారం పీజీసీఐఎల్ నిబంధనలకు లోబడే ఒప్పందాలు జరిగాయన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఇది దోహదపడిందేగానీ, ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు. భద్రాద్రి విద్యుత్ కేంద్రం సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మాణం విషయంలో అప్పుడు ఉన్న చట్టాలకు, నిబంధనలకు లోబడే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అతి తక్కువ కాలంలో నిర్మాణం పూర్తి చేస్తామని బీహెచ్ఈఎల్ ముందుకురావడంతో కొత్తగూడెంలో 800 మెగావాట్ల ప్రాజెక్టు, మణుగూరులో నాలుగు 270 మెగావాట్ల ప్రాజెక్టుల నిర్మాణం ఆ సంస్థకు అప్పగించినట్లు చెప్పారు. రైతులకు 24 గంటల విద్యుత్, పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్లను దృష్టిలో పెట్టుకొనే నల్గొండ జిల్లా దామరచర్లలో 4వేల మెగావాట్ల అల్ట్రా మెగా పవర్‌ఎ÷–లాంట్ నిర్మాణానికి

మిగతా 2లో..

## ప్రజా నాడి




## శంసాబాద్‌లో అమెరికన్ డాలర్లు స్వాధీనం



హైదరాబాద్,జూన్29 (ప్రజా మంటలు):

శంషాబాద్ విమానాశ్రయంలో విదేశీ కరెన్సీ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఓ విదేశీ ప్రయాణికుడి నుంచి రూ. 67.11 లక్షలు విలువైన అమెరికన్ డాలర్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సమాచారం అందుకున్న ఆఖీఎ స్లీత్‌లు దుబాయ్‌కి వెళ్లే ప్రయాణికుడిని విమానాశ్రయంలో ఆపి, బ్యాగేజీని తనిఖీ చేశారు. సదరు ప్రయాణికుడు అక్రమంగా దేశం నుంచి తరలించేందుకు ప్రయత్నిస్తున్న రూ.67,11,250కి సమానమైన అమెరికన్ డాలర్లను అధికారులు గుర్తించారు. కస్టమ్స్ చట్టం 1962 నిబంధనల ప్రకారం విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకుని, ప్రయాణికుడిని అరెస్టు చేస్తారు. . దీని వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు తదుపరి ఇన్వెస్టిగేషన్ కొనసాగిస్తున్నారు.

# విమానాశ్రయ ఘటనపై రాజకీయ విమర్శలు

**మండిపడ్డ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**



న్యూఢిల్లీ, జూన్ 29 (ప్రజా మంటలు):

భారీ వర్షాల కారణంగా ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కూలిన ఘటనపై ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు విమర్శించారు. ఈ ఘటనతో రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. వనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'విమానాశ్రయ టెర్మినల్ కూలిన ఘటనపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయి. ఇది నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వారు అసత్యాలు ప్రచారం ప్రచారం చేస్తున్నారు. కూలిన భవనం 15 ఏళ్ల క్రితం అంటే 2009లో ప్రారంభించారు. ప్రధాని మోదీ ప్రారంభించిన టెర్మినల్ వేరు. ఇలాంటి ఫేక్ న్యూస్‌లు ప్రచారం చేయడం సరికాదు' అని రామ్మోహన్ పేర్కొన్నారు. పైకప్పు కూలిన ఘటనపై తాను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నానని ఎక్స్‌లో వెల్లడించారు. టెర్మినల్ వన్ వద్ద ఉన్న ప్రయాణీకులందరికీ సహాయం వెంటనే అందించాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. ఘటనలో ఒకరు చనిపోగా.. మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించారు. విమానాశ్రయ టర్మినల్ కూలిన ఘటనపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మాట్లాడుతూ.. 'గత పదేళ్లలో మోదీ పాలనలో దేశంలో జరిగిన నాసిరకం పనులకు తాజాగా జరిగిన ఘటనలు నిదర్శనం.

మిగతా 2లో..



## కేజ్రీవాల్‌కు మరోమారు షాక్

12 వరకు జ్యుడిషియల్ కస్టడీ

న్యూఢిల్లీ, జూన్ 29 (ప్రజా మంటలు):

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సీఎం అరవింద్ కేజీవ్రాల్‌కు 3 రోజుల సీబీఐ కస్టడీ శనివారం పూర్తయింది. కస్టడీ ముగియడంతో సీబీఐ అధికారులు.. కేజీవ్రాల్‌ను కోర్టులో హాజరు పరిచారు. విచారించిన రౌస్ అవెన్యూ కోర్టు కేజీక్రి మరో 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ తీర్పు వెలువరించింది. జులై 12 వరకు ఆయన రిమాండ్‌లో ఉండనున్నారు. కోర్టు

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

## కేజ్రీవాల్‌కు మరోమారు షాక్

12 వరకు జ్యుడిషియల్ కస్టడీ తీర్పుతో కేజ్రీ, ఆమ్ ఆద్మీ పార్టీకి షాక్ తగిలిన్నట్లైంది. కేజ్రీవాల్‌ని మరి కాసేపట్లో తీహార్ జైలుకు తరలించనున్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ను వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని బీజేపీని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది. ఇందులో భాగంగా శనివారం ఢిల్లీలోని దిన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని బీజేపీ కేంద్ర కార్యాలయం ఎదుట ఆప్ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఆ క్రమంలో బీజేపీకి వ్యతిరేకంగానినాదాలు చేశాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థల దుర్వినియోగం, నియంత పాలన అంతం.. కోసం అంటూ పార్టీ శ్రేణులు ప్లకార్డులను ప్రదర్శించాయి. మరోవైపు బీజేపీ కేంద్ర కార్యాలయం వద్ద అనుమతి లేదంటూ ఆప్‌కి చెందిన ఆందోళనకారులను పోలీసులు నిలిపివేసే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

## విమానాశ్రయ ఘటనపై రాజకీయ విమర్శలు

అయోధ్యలో నీటి లీకేజ్, విమానాశ్రయం కూలిపోవడం తదితర సమస్యలన్నీ నాసిరకం పనుల వల్లే జరిగాయి. 2023 – 24లలో డబుల్ ఇంజిన్ సర్కార్ నిర్మించిన 13 కొత్త వంతెనలు కూలిపోయాయి. గుజరాత్‌లో మోర్బీ బ్రిడ్జి కూలింది. అయోధ్యలో కొత్త రోడ్లు అధ్వానంగా మారాయి. ముంబయి ట్రాన్స్ హార్బర్ లింక్ రోడ్డులో పగుళ్లు వచ్చాయి. ఇదంతా మోదీ ప్రభుత్త నిర్లక్ష్యం వల్ల జరిగినవే' అని ఖర్గే ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## తెలంగాణ అవసరాల మేరకే విద్యుత్ ఒప్పందాలు

ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఒక విషయంలో విచారణ జరుపుతున్నప్పుడు ఒప్పందాల్లో భాగస్వాములైన అందరినీ విచారించాలి గానీ, కొంతమంది వద్దే సమాచారం తీసుకొని మీడియా సమావేశంలో మాట్లాడటం బాధకరమన్నారు. ఇది తమ రాజకీయ ప్రత్యర్థులు కక్షపూరితంగా చేసిన నిరాధార, అర్థరహిత ఆరోపణలకు ఊతమిచ్చినట్లు ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు సుదీర్ఘ లేఖను జగదీశ్‌రెడ్డి జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌కు పంపించారు.

## హెరిటేజ్ సిటీగా వరంగల్ అభివృద్ధి

నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హన్మకొండ కలెక్టరేట్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు అభివృద్ధి పనుల పురోగతి, చేపట్టాల్సిన పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సీఎం సమీక్షిస్తున్నారు. నగరాభివృద్ధికి సంబంధించి ఇన్‌చార్జి మంత్రి ప్రతీ 20రోజులకోసారి సమీక్ష నిర్వహించాలని అన్నారు. మామునూరు ఎయిర్ పోర్ట్‌పై సైతం సమీక్షించారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖలతో పాటు సీఎస్ శాంతికుమారి,డీజీపీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ఇన్నర్, ఔటర్‌రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణకు అవసరమయ్యే నిధులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. నేషనల్ హైవే నుంచి నేషనల్ హైవేకు కనెక్ట్ అయ్యేలా ఔటర్ రింగ్ రోడ్డు ఉండాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి టెక్స్‌టైల్ పార్క్‌కు కనెక్టివిటీ ఉండేలా రోడ్డుమార్గం ఉండేలా చూడాలన్నారు. స్మార్ట్ సిటీ మిషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. డ్రింకింగ్ వాటర్ లైన్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నాలాలు ఆక్రమణలకు గురవకుండా చర్యలు చేపట్టాలన్నారు. నగర అభివృద్ధికి సంబంధించి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. వరంగల్‌లో డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

## కాంగ్రెస్ అభివృద్ధిలో కీలక భూమిక

వ్యక్తంచేశారు. డీఎస్ పార్థివదేహానికి మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాళులు అర్పించారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి డి.శ్రీనివాస్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, డీఎస్ గొప్ప నాయకునిగా ఎదిగారని కొనియాడారు. సామాన్య స్థాయి నుంచి పీసీసీ అధ్యక్షుడు, మంత్రిగా పని చేసే స్థాయికి ఆయన ఎదిగారని గుర్తు చేశారు. డీఎస్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు సుఖేందర్ రెడ్డి తెలిపారు. సీనియర్ నేత, మాజీ మంత్రి డీ.శ్రీనివాస్ మృతిపట్ల కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విచారం వ్యక్తంచేశారు. వారి సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజాసేవకు అంకితమయ్యారని చెప్పారు. 2004–2009లో అసెంబ్లీలో వారందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాని, బీజేపీ ఎంపీ అరవింద్, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆదివారం ఉయదం నిజామబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానికి సంబంధించిన ఏర్పాట్లు చేయడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు.

# కాంగ్రెస్ సీనియర్ నేత డిఎస్ కన్నుమూత

**ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస**

**నిజామాబాద్‌కు భౌతిక కాయం తరలింపు**

**నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు**



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డీఎస్.. శనివారం తెల్లవారుజామున 3 గంటలకు తుదిశ్వాస విడిచారు.దీంతో బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఆయన స్వగృహానికి భౌతికకాయాన్ని తరలించారు. మధ్యాహ్నం 2 గంటల వరకు పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం నిజామాబాద్ పట్టణానికి తరలిస్తారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన సొంత నియోజకవర్గమైన ఇందూరు పట్టణంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఇదే విషయాన్ని కుటుంబ సభ్యులు కూడా వెల్లడించారు.పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఢిల్లీలో ఉన్న ఆయన కుమారుడు, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మధ్యాహ్నానికి హైదరాబాద్ చేరుకున్నారు. అనంతరం డీఎస్ భౌతిక కాయాన్ని ప్రజలు, అభిమానుల సందర్శనార్థం నిజామాబాద్‌కు తరలించున్నారు. డీఎస్ మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తంచేశారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీఎస్ భౌతికకాయానికి నివాళులర్పించారు. బిఆర్ఎస్ నేత కెటిఆర్, తదితరులు డిఎస్ ఇంటికి వెళ్లి నివాళి అర్పించారు.

# నాన్నా ఎప్పటికీ నీవే నా హీరో

**భావోద్వేగానికి గురైన ఎంపి అర్వింద్**



హైదరాబాద్, (ప్రజా మంటలు): తండ్రి డిఎస్ తన నిజజీవిత హీరో అని ఆయన కుమారుడు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ భావోద్వేగానికి లోనయ్యారు. నాన్న నువ్వు ఎప్పటికీ నాతోనే ఉంటావు.. ఎప్పటికీ నాలోనే ఉంటావంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'అన్నా.. అంటే నేనున్నా అని.. ఏ ఆపదలో అయినా ఆదుకునే శీనన్న ఇక లేరు. ఐ విల్ మిస్ యూ డాడీ!.. నా తండ్రి, నా గురువు అన్నీ మా నాన్నే. ఎదురొడ్డు, పోరాడు, భయపడకు అని నేర్పింది మా నాన్నే. ప్రజలను ప్రేమించు, ప్రజల కొరకే జీవించు అని చెప్పింది మా నాన్నే. నాన్నా..! నువ్వు ఎప్పటికీ నాతోనే ఉంటావు. ఎప్పటికీ నా లోనే ఉంటావు' అంటూ పోస్ట్ చేశారు. 1948 సెప్టెంబర్ 27న నిజామాబాద్‌లో జన్మించిన డీఎస్.. నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. విద్యార్థి సంఘ నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌లో పనిచేశారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారిగా 1989లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల బరిలో దిగిన ఆయన.. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో గెలుపొందారు. అనంతరం 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. 1989 నుంచి 1994 వరకు గ్రామీణాభివృద్ధి, ఐ అండ్ పీఆర్ మంత్రిగా, 2004 నుంచి 2008 వరకు ఉన్నతవిద్య, అర్బన్ లాండ్ సీలింగ్ శాఖ మంత్రిగా పనిచేశారు. 2004లో అప్పటి టీఆర్ఎస్‌తో పొత్తుకుదుర్చుకోవడంలో కీలకపాత్ర పోషించారు. 2013 నుంచి 2015 మధ్య ఎమ్మెల్సీగా సేవలందించారు. తెలంగాణ ఆవిర్భావంత తర్వాత మండలి విపక్ష నేతగా పనిచేశారు. రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం రాకపోవడంతో 2015లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ అంతర్ రాష్ట్ర వ్యవహారాల సలహాదారుగా పనిచేశారు. 2016 నుంచి 2022 వరకు బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. అయితే బీఆర్ఎస్‌తో విభేదించిన ఆయన తన పదవీ కాలం ముగిసే వరకు పార్టీకి దూరంగా ఉన్నారు. అనంతరం ఆ పార్టీకి రాజీనామాచేసి సొంతగూటికి చేరారు. అయితే మరోవైపు అనారోగ్య సమస్యలతో డీఎస్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.



# డిఎస్ మృతికి బిఆర్ఎస్ నేతల సంతాపం

**భౌతిక కాయం వద్ద మాజీమంత్రుల నివాళి**

హైదరాబాద్, (ప్రజా మంటలు): కాంగ్రెస్ సీనియర్ నేత డీ శ్రీనివాస్ మృతిపట్ల మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్ రెడ్డి సంతాపం వ్యక్తంచేశారు. మంత్రిగా, ఎంపీగా డీఎస్ సుదీర్ఘకాలం సేవలందించారని హరీశ్ రావు అన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. డీఎస్ మరణం బాధాకరమని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కిందిస్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత స్థాయికి చేరుకున్నారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారని వెల్లడించారు. బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో డీఎస్ పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సామన్య కార్యకర్త నుంచి పీసీసీ అధ్యక్షుడి వరకు అంచెలంచెలుగా డీఎస్ ఎదిగారని మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఆయన మృతిపట్ల సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గతకొతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం తెల్లవారుజామున 3 గంటలకు తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని నివాసంలో ఉన్న ఆయన భౌతికకాయాన్ని మధ్యహ్నాం నిజామాబాద్‌కు తరలించనున్నారు.

# డిఎస్ మృతికి చంద్రబాబు సంతాపం

**ఆయన మృతి రాజకీయాల్లో తీరని లోటని వెల్లడి**

అమరావతి,జూన్29 (ప్రజా మంటలు): తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, ఉమ్మడి రాష్ట్ర పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మృతిపట్ల సీఎం నారా చంద్రబాబు నాయడు సంతాపం తెలిపారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న డీఎస్ మంత్రిగా, ఎంపిగా తనదైన ముద్ర వేశారని చంద్రబాబు అన్నారు. ఆయన మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు. శ్రీనివాస్ ఎప్పుడూ హుందాగా రాజకీయాలు చేసేవారని.. తాను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సీఎం చంద్రబాబు ప్రార్థించారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షునిగా పని చేసిన డీఎస్, కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీకి ఆయన విశిష్ట సేవలను అందించారని అభిప్రాయపడ్డారు. సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన డీఎస్ రాజకీయ నేతలెందరికో ఆదర్శంగా నిలిచారని స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలోనూ, కాంగ్రెస్ రాజకీయ ప్రస్థానంలో ఆయన తన ప్రత్యేక ముద్రను చాటుకున్నారని గుర్తు చేసుకున్నారు. డి.శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. ఆయన కుటుంబసభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## డిఎస్ మృతికి కెసిఆర్ సంతాపం

హైదరాబాద్,జూన్29 (ప్రజా మంటలు): మాజీ మంత్రి డి శ్రీనివాస్ మరణం పట్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు శనివారం తెల్లవారుజామున 3 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. గుండెపోటుతో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. 2004, 2009లో మంత్రిగా సేవలందించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితులుగా ఉన్నారు. ఆయన పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నసమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అంతా ఆయనను డీఎస్ అని పిలిచేవారు. ప్రస్తుతం ఆయన మృతదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంట్లోనే ఉంచారు. సాయంత్రం నిజామాబాద్ ప్రగతినగర్‌లోని ఆయన నివాసానికి పార్థీవదేహాన్ని తరలించనున్నారు. డీఎస్ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు.

# రాజకీయాలకు అతీతమైన వ్యక్తి డిఎస్

**భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన వెంకయ్య**

**కాంగ్రెస్ కండువా కప్పి నివాళి అర్పించిన మంత్రులు**

హైదరాబాద్,జూన్29 (ప్రజా మంటలు): డీఎస్ రాజకీయాలకు అతీతమైన వ్యక్తి అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కొనియాడారు. డీఎస్ పార్థివ దేహానికి ఆయన నివాళి అర్పించారు. మిత్రులు డి. శ్రీనివాస్ మృతి చెందారని తెలిసి చాలా బాధపడ్డానన్నారు. ఎంతో అనుభవం ఉన్న నాయకుడిని ప్రజలు కోల్పోయారనినారు. ఆనాటి రాజకీయ నేతల్లో మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి డీఎస్ అని అన్నారు. ఏ మాత్రం గర్వం లేకుండా అందర్నీ కలుపుకుపోయేవారన్నారు. డీఎస్ కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉందన్న వెంకయ్యనాయుడు.. డీఎస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాడ సానుభూతి తెలిపారు. ప్రస్తుతం ఆయన భౌతికకాయాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంట్లో ఉంచారు. ప్రస్తుతం ఆయనను చూసేందుకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తరలివస్తున్నారు. సాయంత్రం ఆయన భౌతికకాయాన్ని నిజామాబాద్‌లోని ప్రగతినగర్‌లోని ఆయన నివాసానికి తరలించనున్నట్లు సమాచారం. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. అయితే.. డి.శ్రీనివాస్ మృతి పట్ల రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. టీపీసీసీ తరుపున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు నివాళులు అర్పించారు. డీఎస్ పార్థీవదేహంపైన కాంగ్రెస్ పార్టీ జెండా కప్పిన భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబులు నివాళులు అర్పించారు. నిజామాబాద్ కు డీఎస్ పార్థివదేహం తరలించనున్నట్లు సమాచారం. శ్రీనివాస్ 1948 సెప్టెంబర్ 27న నిజామాబాద్ జిల్లాలో జన్మించాడు. నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తి చేశాడు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. 1989లో కాంగ్రెస్ పార్టీ తరపున రంగంలోకి దిగి నిజామాబాద్ అర్బన్ నుంచి తొలిసారిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. తర్వాత 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలిచి.. 1998లో ఉమ్మడి ఏపీ పీసీసీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. డీఎస్ అంత్యక్రియలు రేపు నిజామాబాద్‌లో అధికారిక లాంఛనాలతో జరపాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారికి ఆదేశాలు జారీ చేశారు. డీఎస్ పార్థివ దేహాన్ని ఇవాళ సాయంత్రం నిజామాబాద్ లోని స్వగ్రామానికి తరలించనున్నారు. అభిమానుల సందర్శనార్థం నిజామాబాద్ బైపాస్ రోడ్డులోని స్థలంలో అంత్యక్రియలు చేయనున్నారు.

# నేడు నిజామాబాద్‌లో డిఎస్ అంత్యక్రియలు

**హాజు కానున్న సిఎం రేవంత్, మంత్రులు**

నిజామాబాద్,జూన్29 (ప్రజా మంటలు): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ అంత్యక్రియలకు ఆదివారం సిఎం రేవంత్ సహా కాంగ్రెస్ ప్రముఖులు హాజరు కానున్నారు. ఆయన అంత్యక్రియలకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాస్.. తెల్లవారు జామున 3.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. అయితే కాంగ్రెస్ సంప్రదాయం ప్రకారం పీసీసీ మాజీ చీఫ్ డీఎస్ పార్థీవదేహంపై పార్టీ కండువా, జెండా కప్పి కాంగ్రెస్ నేతలు గౌరవించారు. డీఎస్ పార్థివ దేహంపై కాంగ్రెస్ కండువా కప్పగానే డీఎస్ చివరి కోరిక తీరిందని ఆయన స్నేహితులు చెబుతున్నారు.కాగా.. డీఎస్‌కు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేయాలని సీఎస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం నిజామాబాద్‌లో డీ శ్రీనివాస్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. నిజామాబాద్ బైపాస్ రోడ్డులోని సొంత స్థలంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు డీఎస్ పెద్ద కుమారుడు, నిజామాబాద్ మాజీ మేయర్ సంజయ్ తెలిపారు. డీఎస్ అంత్యక్రియల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. నిజామాబాద్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రానున్నారు. ఈ మేరకు సీఎం కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వ్యవయం పెంపు

నిబంధనలకు విరుద్ధంగా అంచనా వ్యయం పెంచడమెంటని ÷రైయ్యారు. నిర్మాణ వ్యయంపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని సీఎం ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందేనని నిర్మాణ సంస్థకు తేల్చి చెప్పారు. హైదరాబాద్‌తో పాటు సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలన్నారు సీఎం రేవంత్ రెడ్డి. హెరిటేజ్ సిటీగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వరంగల్ పర్యటనలో భాగంగా హనుమకొండ కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు సీఎం సూచించారు. ఆస్పత్రి విసయంలో మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా అంచనా వ్యయం పెంచడమెంటని ఆయన మండిపడ్డారు. నిర్మాణ వ్యయంపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందేనని నిర్మాణ సంస్థకు సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు.అయితే.. ఇదిలా ఉంటే.. వరంగల్ సమిక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. హైదరాబాద్ తో సమానంగా వరంగల్ ను అభివృద్ధి చేయాలన్న సీఎం.. హెరిటేజ్ సిటీగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భూసేకరణకు అవసరమయ్యే నిధులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. నేషనల్ హైవే నుంచి నేషనల్ హైవేకు కనెక్ట్ అయ్యేలా ఔటర్ రింగ్ రోడ్డు ఉండాలని, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి టెక్స్టైల్ పార్కుకు కనెక్టివిటీ ఉండేలా రోడ్డుమార్గం ఉండేలా చూడాలన్నారు. స్మార్ట్ సిటీ మిషన్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, డ్రింకింగ్ వాటర్ లైన్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. నాలాలు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని, వరంగల్ నగర అభివృద్ధిపై ఇకనుంచి ప్రతీ 20రోజులకోసారి ఇంచార్జ్ మంత్రి సమీక్ష నిర్వహించాలని, నగర అభివృద్ధికి సంబంధించి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ తెలిపారు. వరంగల్ లో డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని, ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి.

# చంద్రబాబు చేతుల మీదుగా పెన్షన్ల పంపిణీ

### ఏదో ఒక గ్రామంలో పంపిణీ చేసేందుకు ఆలోచన

### 1న ఉదయమే పంపిణీకి ఆదేశాలు

అమరావతి,జూన్29 (ప్రజా మంటలు): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వృద్ధాప్య పెన్షన్లను భారీగా పెంచారు. అన్ని రకాల పెన్షన్లను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా తానే స్వయంగా వెళ్లి పంపిణీ చేయాలని చంద్రబాబు నిర్ణయించుకున్నారు. లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయనున్నారు. ఏ లబ్దిదారుల ఇళ్లకు వెళతారన్నది అధికారికంగా ప్రకటించనున్నారు. తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో చంద్రబాబు పెన్షన్లను లబ్దిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేసే అవకాశం ఉంది. మరోవైపు జూలై1. ఉదయం 6 గంటలకు ఫెన్షన్లు పంపిణీచేపట్టాలని ఆదేశించారు. పెన్షన్ లబ్దిదారులకు ఇప్పటికే చంద్రబాబు బహిరంగలేఖ రాశారు. ఏ ఆశలు, ఆకాంక్షలతో అయితే మీరు ఓట్లు వేసి గెలిపించారో వాటిని నెరవేర్చడమే తక్షణ, ప్రథమ కర్తవ్యం. మ్యానిఫెస్టోలో చెప్పినట్లు పింఛన్‌ను ఒకేసారి రూ. 1000 పెంచి. ఇకపై రూ.4000 ఇసున్నాం. దివ్యాంగులకు రూ.3000 పెంచి ఇక నుంచి రూ.6000 ఇస్తున్నందుకు సంతోషంగా ఉంది. 28 వర్గాలకు చెందిన 65,18,496 మంది పింఛన్ లబ్దిదారులకు జూలై 1వ తేదీ నుంచే పెంచిన పింఛన్లు ఇంటి వద్దనే అందిస్తున్నాము. కొత్త ప్రభుత్వం ముందు అనేక ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజు నుంచే మంచి చేసే నిర్ణయాలు తీసుకున్నామని లేఖలో తెలిపారు. పింఛన్ల పెంపు వల్ల ప్రభుత్వం పై నెలకు అదనంగా రూ.819 కోట్ల భారం పడుతున్నా.. ప్రజా శ్రేయస్సుకోసం ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి తెచ్చామని లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో వికృత రాజకీయాలకోసం నాటి అధికార పక్షం మిమ్మల్ని పింఛన్ విషయంలో ఎంతో క్షోభపెట్టింది. ఆ మూడు నెలల పాటు మీరు పింఛన్ అందు కోవడానికి పడిన కష్టాలు చూసి నేను చలించిపోయాను. మండు టెండలో, వడగాడ్పుల మధ్య మీరు పడిన అగచాట్లు చూసి? ఏప్రిల్ నెల నుంచే పింఛన్ పెంపును వర్తింపచేస్తానని మాటిచ్చాను. అందులో భాగంగా ఏప్రిల్, మే, జూన్ నెలలకు కూడా ఈ పెంపును వర్తింప చేసి మీకు అందిస్తున్నాము. మూడు నెలలకు పెంచిన రూ.3000, జూలై నెల పింఛన్ రూ.4000 కలిపి మొత్తం రూ.7000 మీ ఇంటికి తెచ్చి ఇస్తున్నామని చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు. సంక్షేమ పాలకుడు, సామాజిక పింఛన్ విధానానికి ఆధ్యుడు అయిన స్వర్గీయ ఎన్టీఆర్ పేరును తిరిగి ఈ పింఛన్ల కార్యక్రమానికి పెట్టాము. ఎన్టీఆర్ భరోసా పేరుతో ఇకపై మీ ఇంటి వద్ద సామాజిక పింఛన్ల పంపిణీ జరుగుతుంది. పెరిగిన పింఛనుతో మీకు ఆర్థిక స్వావలంబన, భరోసా లభిస్తుందని ఆశిస్తున్నాము. ప్రజా భద్రత మా బాధ్యత. ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను. ఎప్పుడూ మంచి చేయాలని చూసే ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించమని కోరుకుంటున్నానని చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు. అందరికీ తన సందేశం చేర్చడంతో పాటు కొంత మంది లబ్దిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లాలనుకోవడం ఆసక్తికరంగా మారింది.

# కొండగట్టును దర్శించుకున్న పవన్ కళ్యాణ్

### ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన డిప్యూటీ సిఎం

### దారిపొడవునా అభిమానుల నీరాజనాలు



కొండగట్టు,జూన్29(ప్రజా మంటలు): ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్‌ను చూసేందుకు భారీ సంఖ్యలో స్థానికులు ఆలయానికి తరలివచ్చారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలు దేరిన పవన్‌కు.. మార్గమధ్యలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. తుర్కపల్లి క్రాస్ రోడ్స్ వద్ద జనసేన నాయకులు గజమాలతో ఆయనను సత్కరించారు. పవన్ రాక నేపథ్యంలో.. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి రోడ్డుమార్గంలో శనివారం ఉదయం ఆయన కొండగట్టుకు బయల్దేరారు. ఈ సందర్భంగా ఆయనకు దారి పొడవునా అభిమానులు ఘనస్వాగతం పలికారు. ముందుగా హైదరాబాద్ శివారులోని తుర్కపల్లిలో పవన్ కల్యాణ్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చారు. తుర్కపల్లి నుంచి బయల్దేరిన తర్వాత సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడి వద్ద కూడా జనసేన అధినేతకు ఘన స్వాగతం లభించింది. అక్కడ పవన్ కల్యాణ్‌ను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అభిమానులు అందించిన వీరఖడ్గంతో ఆయన ఫొటోలకు పోజులిచ్చారు. అనంతరం అభిమానులకు అభివాదం చేసుకుంటూ కొండగట్టుకు బయల్దేరి వచ్చారు. ఏపీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించడంతో పవన్ కల్యాణ్ వారాహి అమ్మవారి దీక్షను చేపట్టారు. 11 రోజుల పాటు నిష్టతో ఈ దీక్షను పాటించనున్నారు. ఈ క్రమంలోనే తమ ఇలవేల్పు అయిన కొండగట్టు ఆంజనేయ స్వామిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, గత ఏడాది ఎన్నికలకు ముందు ప్రచారం మొదలుపెట్టిన పవన్ కల్యాణ్.. తన వారాహి ప్రచార రథానికి కొండగట్టులోనే ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారాహి విజయయాత్రను నిర్వహించారు.



# రసాయన పరిశ్రమలో పేలుడు

### భారీగా చెలరేగిన మంటలు



శ్రీకాకుళం,జూన్29 (ప్రజా మంటలు): తెలుగు రాష్ట్రాల్లోని పరిశ్రమల్లో వరుస పేలుడు ఘటనలు కలకలం సృష్టిస్తున్నాయి. శుక్రవారం షాద్‌నగర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఆరుగురు కార్మికులు మృత్యువాత పడిన ఘటనను మరిచిపోకముందే శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలోని రసాయన పరిశ్రమలో పేలుడు సంభవించింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరుగకపోవడతో ప్యాక్టరీ యాజమాన్యం, కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు. సరకా ల్యాబొరేటరీస్‌లో రియాక్టర్ పేలడంతో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే పరిశ్రమ ప్రాంగణం ఆవరణలో ఉన్న పలు వాహనాలకు మంటలు అంటుకుని దగ్ధయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

# వేమన వర్సిటీ విసి, రిజిస్ట్రార్‌ల రాజీనామా

### ఆమోదించిన ఉన్నత విద్యామండలి

కడప,జూన్29 (ప్రజా మంటలు): యోగి వేమన వర్సిటీ(వైవీయూ) ఉప కులపతి చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య రాజీనామా చేశారు. వారి రాజీనామాలను ఉన్నత విద్యామండలి ఆమోదించింది. వీరిద్దరూ వైకాపాతో అంటకాగినట్లు ఆరోపణలున్నాయి. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా వైవీయూ ప్రిన్సిపల్ రఘునాథ్‌రెడ్డికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. మరోవైపు విక్రమ సింహపురి వర్సిటీ రిజిస్ట్రార్ పదవికి రామచంద్రారెడ్డి రాజీనామా చేశారు. అనంతరం కడపలోని వైవీయూలో ప్రొఫెసర్‌గా చేరారు. నిబంధనలకు విరుద్ధంగా కడప ఆర్కిటెక్చర్ అండ్ ÷న్ ఆర్ట్స్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్న సురేంద్రనాథ్‌రెడ్డి రిలీవ్ అయ్యారు. ప్రభుత్వం మారడంతో తనను రిలీవ్ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆయన దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం రిలీవ్ చేయాలని నిర్ణయించింది. దీంతో ఆయన తిరిగి వైవీయూలో ప్రొఫెసర్‌గా చేరనున్నారు. మూడేళ్లపాటు సురేంద్ర ఆర్కిటెక్చర్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా వ్యవహరించారు.

# రేషన్ మాఫియాకు కాకినాడ అడ్డా

### రెండోరోజూ మంత్రి నాదెళ్ల తనిఖీలు

### సిఐడి విచారణ కోరుతామని వెల్లడి

కాకినాడ,జూన్29 (ప్రజా మంటలు): రేషన్ మాఫియాకు కాకినాడ అడ్డాగా మారిందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కాకినాడలో రేషన్ మాఫియా అక్రమాలపై సీఐడీ విచారణ కోరతామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పౌరసరఫరాల శాఖపై కాకినాడలో రెండో రోజు నిర్వహించిన సమీక్షను నిర్వహించారు. రేషన్ మాఫియాకు కాకినాడ అడ్డాగా మారిందని ఆరోపించారు. అశోక ఇంటర్నేషనల్ హెచ్ 1 గోదాంను తనిఖీ చేసి నిల్వ ఉంచిన బియ్యాన్ని పరిశీలించారు. నాణ్యత లేని 5,300 మెట్రిక్ టన్నుల బియ్యం సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. గోదాంలోని నిల్వలపై స్టాక్ రిజిస్టర్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ పోర్టును వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబం ఆక్రమించి అక్రమంగా బియ్యం ఎగుమతి చేస్తుందని ఆరోపించారు. రేషన్ బియ్యం అక్రమాల తనిఖీ కోసం బృందాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తనిఖీలు పూర్తయ్యేవరకు బియ్యం ఎగుమతులు ఆపేస్తామని వివరించారు. కాకినాడ పోర్టు నుంచి ఇతర దేశాలకు రేషన్ సరకులు వెళ్తున్నాయని తెలిపారు. రేషన్ మాఫియా అక్రమాలపై సీఐడీ విచారణ కోరతామన్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టోల్‌గేట్‌ల వద్ద సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా విచారణ జరుపుతాం. కాకినాడలో తొలిరోజు తనిఖీల్లో 6 గోదాముల్లో లోపాలు గుర్తించాం. రేషన్ బియ్యం అక్రమ నిల్వలు గుర్తించాం. 7615 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేశాం. కాకినాడలో ఒక వ్యవస్థీకృత మాఫియా ఏర్పడింది. ఇక్కడి రేషన్ మాఫియా సొంత నౌకనే ఏర్పాటు చేసుకునే స్థాయిలో ఉంది. కాకినాడ పోర్టు అంటేనే అందరూ భయపడుతున్నారు. నిన్నటి తనిఖీల్లో ఆరు సంస్థల పాత్రను గుర్తించాం. వీటిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం' అని నాదెండ్ల మనోహర్ తెలిపారు.

# ధర్మపురి మృతికి జనసేనాని సంతాపం

అమరావతి,జూన్ 30 (ప్రజా మంటలు): మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ మృతి పట్ల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. డీఎస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. .శ్రీనివాస్ మరణం బాధాకరమన్నారు. జనసేన పార్టీ ఎదుగుదలను డీఎస్ ఆకాంక్షించారని గుర్తుచేసుకున్నారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఉన్న డీఎస్ ఉమ్మడి రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, ఉన్నత విద్య శాఖల మంత్రిగా సేవలందించారని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బలంగా తన వాదం వినిపించారని అన్నారు. వారిని రెండు మూడు సందర్భాల్లో కలిశానని గుర్తుచేసుకున్నారు. తన రాజకీయ ప్రయాణం, అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారని తెలిపారు.. డీఎస్ కుమారుడు, లోక్ సభ సభ్యులు ధర్మపురి అరవింద్, ఇతర కుటుంబ సభ్యులకు పవన్ కళ్యాణ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# తిరుమలలో అక్రమంగా శారదాపీఠం

### నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు

### ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి

తిరుపతి,జూన్29(ప్రజా మంటలు) తిరుమల పవిత్రతను కాపాడేందుకు ఎంతటి త్యాగానికి అయినా సిద్ధమని ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి పునరుద్ఘాటించారు. తిరుమలలో మఠాలు ముఠాలుగా మారాయని ఆయన ఆరోపించారు. తిరుమలలోని విశాఖ శారదా పీఠాన్ని వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లఘించి విశాఖ శారదా పీఠం కట్టడాలు జరిగాయని శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. వాగు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని విమర్శించారు. పీఠాల పేరుతో దళారీలు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. తిరుమలలో అన్నీ వ్యాపారంగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వెంటనే తిరుమలను ప్రక్షాళన చేయాలని కోరారు. దళారీలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చర్యలు తీసుకోకపోతే దీక్షలు చేస్తామని హెచ్చరించారు. తిరుమలలో శారదా పీఠం చేపట్టిన భవన నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని ఇటీవల ఏపీ హైకోర్టు ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా తిరుమల గోగర్భం డ్యామ్ వద్ద విశాఖ శారదా పీఠం నిర్మిస్తున్న రెండు భవన నిర్మాణ పనులను నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిపిందే. కాగా, తిరుమలలో విశాఖ శారదా పీఠం అక్రమాలపై కొద్దిరోజులుగా శ్రీనివాసానంద సరస్వతి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శారదా పీఠాన్ని వ్యాపార పీఠంగా మార్చేశారని విమర్శించారు. నాలుగు అంతస్తులకు అనుమతి ఇస్తే.. అక్కడ ఆరు అంతస్తుల నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. గదులను భక్తులకు అధిక ధరలకు కేటాయిస్తూ దోపిడీలకు పాల్పడుతున్నారని అన్నారు. 10 వేల చదరపు గజాల్లో అక్రమ కట్టడాలు నిర్మించారని పేర్కొన్నారు. శారదా పీఠం ఆక్రమణలు కూల్చకపోతే ప్రాణ త్యాగానికైనా సిద్ధమని హెచ్చరించారు. తిరుమలలో శారదాపీఠం ఆక్రమణలపై జనసేన నేత కిరణ్ రాయల్ కూడా కొద్దిరోజుల నుంచి విమర్శలు చేస్తున్నారు. తిరుమలలో మఠాల పేరుతో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆయన ఇటీవల ఆరోపించారు. శారదా పీఠం వెనుక ÷వ్‌స్టార్ హోటళ్లను తలపించే నిర్మాణాలు చేస్తున్నారని పేర్కొన్నారు. మఠాలను అ÷-దదెకు తీసుకుని భక్తుల నుంచి వైసీపీ నాయకులు భక్తుల నుంచి లక్షలు సంపాదించారని మండిపడ్డారు.

# ఓటు బ్యాంక్ లక్ష్యంగా నగదు బదిలీలు

### ఆర్థికస్థితిని దెబ్బతీసిన డబ్బుల పందేరం

### జగన్ ఓటుబ్యాంక్ వ్యూహంతో రాష్ట్రం కుదేలు

అమరావతి,జూన్ 30 (ప్రజా మంటలు): వైఎస్ జగన్మోహన్ రెడ్డి వివిధ పథకాలతో ప్రజలను ఓటుబ్యాంక్‌గా మార్చుకునే యత్నంలో రాష్ట్రాన్ని దివాళా తీయించారు. ఐదేళ్లపాటు యధేచ్ఛగా సాగిన పందేరం ఇప్పుడు ఎపిని కోలుకోకుండా దెబ్బతీసింది. కేవలం తదుపరి అధికారం తనదే కావాలన్న లక్ష్యంతో పథకాలను అమలు చేసినా ఫలించలేదు. అయితే చేసిన నిర్వాకం వల్ల ఇప్పుడు ఎపి ఆర్థికంగా కోలుకోలేని దశకు చేరింది. ఓ వైపు విపక్ష టిడిపిని దెబ్బతీస్తూ, కేసులతో వారి క్యాడర్‌లో భయాలను పెంచడానికి మాత్రమే పోలీస్ వ్యవస్థను, అధికార వ్యవస్థను వాడుకున్నారు. మరోవైపు నేతలపై పలు కేసులను నమోదు చేసిన్న తీరు కేవలం ఓటుబ్యాంకును పదిలం చేసుకునేవిగా ప్రజలు గుర్తించారు. తెలుగుదేశం పార్టీని దెబ్బకొడితే రాజకీయంగా ఎదురు ఉండదన్న భ్రమలో జగన్ బోల్తాపడ్డారు. ఆయా సామాజికవర్గాల మద్దతు తనకు లభించేలా చేసిన విన్యాసాలు పనికి రాకుండా పోయాయి. హామీల అమలు పేరిట ప్రజాధనాన్ని జగన్మోహన్‌రెడ్డి పంచిపెట్టారు. విమర్శలు వచ్చినా జగన్ మాత్రం లెక్క చేయలేదు. ఇది క్విడ్‌ప్రో అని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ లాంటి వారు టుగానే విమర్శించినా లెక్కచేయలేదు. దీనివల్ల ప్రజలలో తనకు మంచి పేరు వస్తుందన్న ధీమాలో ఆయన రాష్ట్రాన్ని గాడి తప్పించారు. ఇప్పుడు 14 లక్షల కోట్ల అప్పు ఉందని అంటున్నారు. ఇది తీర్చడం అంత ఆషామాషీ కాదు. తెలంగాణలో కెసిఆర్, ఎపిలో జగన్ పోటీపడి అప్పులు చేసి రాష్ట్రాలను గుల్ల చేశారు. విభజన తరవాత ఇలాంటి నేతల కారణంగా రెండు రాష్ట్రాలు పూర్తిగా కుదలేయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను గమనించిన వారు. పాలనలో పెద్దగా మార్పు కనిపించకున్నా పథకాల పేరుతో పందేరం సాగించారని విమర్శలు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ, పథకాల అమలు విషయంలో వెనకడుగు వేయకపోవడం జగన్మోహన్‌రెడ్డి అనుభవ రాహిత్యానికి, స్వార్థానికి పరాకాష్టగా చూడాలి. పటిష్టమైన ఓటు బ్యాంక్‌ను నిర్మించుకోవడమే ఈ పథకాల అమలు వ్యూహమని రాజకీయ విశ్లేషకులు సైతం అప్పుడే హెచ్చరించారు. కానీ చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఇప్పుడు ఎపిలో పరిస్థి ఏర్పడిందని ప్రజలు కూడా అంగీకరిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ సమర్థుడైన చంద్రబాబు దీనిని గట్టెక్కించే పనిలో పడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుమతించక పోయినా ప్రజాధనాన్ని పంచిపెట్టే కార్యక్రమాన్ని కొనసాగించాలన్న ఆలోచనలకు దూరంగా ఉండాలి. దివంగత వైఎస్ కూడా ఇలాగే ప్రజల్లో మంచి పేరు సంపాదించారు. అదే ఆయనను ఉమ్మడి ఎపిలో రెండోసారి అధికారంలోకి తీసుకుని వచ్చింది. అయితే అదేపనిగా ఆయన ఎప్పుడూ డబ్బుల పందేరం చేయలేదు. ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా ముందుకు తీసుకుని వెళ్లారు. పథకాల అమలుతోపాటు సోషల్ ఇంజనీరింగ్ ద్వారా బలమైన ఓటు బ్యాంకును నిర్మించు కోవడానికి జగన్ వేసిన ఎత్తుగడలు ఎలా ఉన్నా ఎపిని కలోలుకోలేని దెబ్బతీసింది. ఉపాధి, ఉద్యోగ రంగాలు దెబ్బతిన్నాయి. పారిశ్రామిక రంగం కుదేలయ్యింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుమతించ కపోయినా ప్రజాధనాన్ని పంచిపెట్టే కార్యక్రమాన్ని కొనసాగించారు. తద్వారా ప్రజలలో మంచి పేరు తెచ్చుకోవాలనీ జగన్ భావించారు. కానీ ప్రజలు అసలు విషయం గుర్తించి పాతరేశారు. మరోవైపు కెసిఆర్ మాయలోపడి తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు కాపీ కొడుతూ వచ్చారు. వాస్తవ పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్ పట్టించుకోవడం లేదనీ సర్వత్రా విమర్శలు వచ్చినా పెడచెవిన పెట్టారు. జీతాలు చెల్లించడానికి కూడా నిధులు లేకుండా చేసుకున్నారు. వీటన్నింటిని పరిశీలించి పరిష్కరించే బృహత్తర బాధ్యత ఇప్పుడు చంద్రబాబుపై పడింది. ఓ వైపు సంఓఏమం కొనసాగిస్తూనే అభివృద్ధిని పరుగులు పెట్టించాలి. పోలవరం, రాజధాని అమరావతిలను పట్టాలకెక్కించాలి. పారిశ్రామిక పురోగతి సాధించాలి.



# పార్లమెంట్ స్తంభన కాదు..చర్చ సాగాలి !

పార్లమెంటులో ప్రజల సమస్యలపై చర్చ సాగాల్సిందే. చర్చకు విపక్షాలు పట్టుబట్టాల్సిందే. చర్చలకు ప్రభుత్వం సహేతుకంగా సమాధానం ఇవ్వాల్సిందే. ఇటీవల నీట్ పరీక్షలపై దుమారం చెలరేగింది. పేపర్ లీకేజీ వ్యవహారం చూస్తుంటే ఇదంతా కొందరు ఆడిన డ్రామాగా కనిపిస్తోంది. లక్షలాదిమంది విద్యార్థులను మోసం చేసి..కొందరు తమ స్వార్థం కోసం పేపర్ లీక్ చేశారని అర్థం అయ్యింది. దీనిపై చర్చించాలని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. ఆయన పట్టుబట్టడం..వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించడం జరిగింది. పార్లమెంట్ వాయిదా పడడంతో ఒకరోజు పార్లమెంట్ వృధా అయ్యింది. ప్రధాన ప్రతిపక్షం సమస్యలను ప్రస్తావించే క్రమంలో రూల్ పొజిషన్ కూడా స్టడీ చేయాలి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ఆమోదించడం అవసరం. దీనిపై చర్చ జరుగుతుంది. ఈ చర్చలో నీట్‌పైనా చర్చించే అవకాశం ఉంటుంది. విపక్షం ఈ సందర్భంగా నీట్ అంశాన్ని ఉపయోగించుకుని ఉండాల్సింది. కానీ చర్చకు పట్టుబట్టడంతో పార్లమెంట్ ఉభయసభలు వాయిదా పడ్డాయి. పార్లమెంట్ స్తంభించిందన్న వార్తలు వచ్చాయి. దీంతో ఈ సమస్య ఆ ఒక్కరోజుతోనే ముగిసింది. కానీ చర్చ సాగివుంటే నిజాలు బయటకు వచ్చేవి. నిజానికి అనేక అంశాలు గత పదేళ్లుగా నానుతున్నాయి. వీటన్నింటిని చర్చించే సత్తా కలిగిన విపక్షం ఇప్పుడు లోక్‌సభలో ఉంది. పార్లమెంట్ సమావేశాలు నిముషం కూడా వృధా కాకుండా చూస్తూనే.. చర్చకు తెరలేపాలి. పార్లమెంట్‌ను స్తంభింప చేయడం, వాకౌట్లు చేయడం పాతపద్ధతి. రూల్ పొజిషన్ మేరకు నోటీసులు ఇచ్చి చర్చ చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో విపక్షం వ్యూహాత్మకంగా అడుగులు వేయాలి. అప్పుడే సమస్యల వ్యవహారం ప్రజల ముందుకు వస్తుంది. పార్లమెంటులో పాలకుల దుర్నీతిని ఎండగట్టేందుకు వ్యూహం కూడా కావాలి. అధికారపక్షం పార్లమెంట్ వాయిదానే కోరుకుంటుంది. ఇది గమనించాల్సి ఉంది. నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటు ఉభయసభలు శుక్రవారం దద్దరిల్లాయి. నీట్‌పై సమగ్ర చర్చను చేపట్టాలన్న తమ డిమాండ్‌కు అధికారపక్షం అంగీకరించకపోవటంతో ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై తొలుత చర్చిద్దామని, ఆ సందర్భంగా నీట్‌పైనా చర్చ జరపవచ్చన్న ప్రభుత్వ సూచనకు విపక్షాలు అంగీకరించలేదు. దీంతో ఉభయసభల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఫలితంగా పలుమార్లు వాయిదా పడ్డాయి. ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే.. నీట్‌తోపాటు ఇతర పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకైన ఘటనలపై చర్చను కోరుతూ కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇతర కార్యకలాపాలను రద్దు చేసి పేపర్ లీకేజీలపై చర్చను చేపడదామని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దీనిపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ.. ఇటీవల దివంగతులైన 13 మంది మాజీ ఎంపీలకు తొలుత నివాళి అర్పిద్దామన్నారు. నివాళి ముగియగానే విపక్ష ఎంపీలు మళ్లీ తమ డిమాండ్‌ను కొనసాగించారు. నీట్ చాలా ముఖ్యమైన అంశమని, దానిపై చర్చ అవసరమని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అయితే, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరపాలని ఇప్పటికే నిర్ణయించామని, ఆ చర్చలోనే అన్ని అంశాలనూ లేవనెత్తవచ్చని, తగిన సమయం ఇస్తానని స్పీకర్ చెప్పారు. దీనిని అవకాశంగా తీసుకుని నీట్‌పై చర్చ చేసివుంటే లక్ష్యం నెరవేరేది. కానీ ఈ అవకాశాన్ని విపక్షం వృధా చేసుకుంది. సభలో ప్రతిష్టంభన నేపథ్యంలో స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇటువంటి గందరగోళమే నెలకొంది. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చను పక్కనపెట్టి, ముందుగా నీట్‌పై చర్చిద్దామని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఇలా చేయడం విపక్షానికి తగిన పనికాదు. విపక్షం తమ పంతం నెరవేరిందని, సభ వాయిదా పడిందని అనుకుంటే పప్పులో కాలేసినట్లే. గతంలో లాగా ప్రతిష్టంభన కార్యక్రమాలతో ప్రజల సమస్యలకు పరిష్కారం దొరకదు. చర్చలు జరిపి ప్రభుత్వం దిగివచ్చేలా చేయాలి. నిజానికి దేశం ఇప్పుడు అనేకానేక సమస్యలు ఎదుర్కొంటోంది. గత పదేళ్లుగా మసిపూసి మారేడుగాయ చేశారు. రూపాయి విలువ రోజురోజుకూ పతనం అవుతోంది. దేశంలో ఆర్థిక దుస్థితిని పరిశీలించి అడ్డుకట్ట వేసే చర్యలు కానరావడం లేదు. ధరలు మోత మోగిస్తున్నాయి. సగటు కుటుంబానికి నెలకు 50వేలు లేనిదే పూట గడవలేని దుస్థితి నెలకొంది. జివిస్టీలు తగ్గించడం, ఇన్‌కమ్ టాక్స్ పరిమితి పెంచడం, ఉపాధి రంగాలను బలోపేతం చేయడం వంటి అత్యవసర చర్యలపై కేంద్ర,రాష్ట్రాలు దృష్టి సారించడం లేదు. ఆర్థికంగా దేశాన్ని బలోపేతం చేసే చర్యలపై మోడీ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోవడంలేదు. కార్పోరేట్లకు అండగా నిలవడం తప్ప ప్రజలకు అండగా ఉండే చర్యలు కానరావడం లేదు. ప్రజలను కష్టాల కొలిమిలోంచి బయటపడేసే చర్యలు కానరా వడం లేదు. పేదలు మరింత పేదలుగా మారారు. అలాగే మధ్య తరగతి ప్రజలు మరింతగా దెబ్బతిన్నారు. కాయకష్టం చేసుకునే వారికి ఢోకా లేకున్నా ఉపాధి, ఉద్యోగ రంగాలు మాత్రం వెక్కిరిస్తున్నాయి. దెబ్బతిన్న రంగాలను గుర్తించి వారిని ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. ప్రధానంగా లోయర్ మిడిల్ క్లాస్ వాళ్లు బాగా దెబ్బతిన్నారు. ఉద్యోగాలు పోయాయి. ఉపాధి దొరకడం లేదు. ఈ వర్గాలను గుర్తించి వారిని నేరుగా ఆదుకునే చర్యలకు ఉపక్రమించాలి. గతంలో ప్రకటించిన ఆత్మనిర్భర భారత్ ఎవరికి మేలు చేసిందో తెలియదు. సర్వే జరిపించి ఉపాధి, ఉద్యోగాలు కోల్పోయిన వారిని గుర్తించి వారికి చేయూతను అందించాలి. అలాగే బ్యాంకులు ఉదారంగా తక్కు వడ్డీలకు రుణాలు ఇచ్చేలా చూడాలి. చిన్నా చితకా వ్యాపారాలు చేసుకునే వారికి ఎలాంటి షరతులు లేకుండా రుణాలు ఇవ్వగలగాలి. అప్పుడే గ్రామీణ ఆర్థికరంగం బలోపేతం అవుతుంది. అసత్యాలు, అర్ధసత్యాలతో ఎప్పటికప్పుడు నెట్టుకురావడం కాక, ప్రజల మనసుల్లో రక్షకులుగా చిరస్థాయి గా నిలిచి పోయేందుకు పాలకులు కృషి చేయాలి. అలాగే ఆర్థికంగా అతిపెద్ద చర్యలకు ఉపక్రమించాలి. ప్రధానంగా ఉపాధిరంగాలను విపరీతంగా ప్రోత్సహించాలి. ప్రజలకు అవసరమైతే వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. చిన్నాచితకా వ్యాపారాలు, ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహకాలు ఇవ్వనతవరకు దేశ అర్థికస్థితి కుదుట పడదని గుర్తించాలి. ఇవన్నీ కూడా చర్చించడానికి వేదిక లేదు. మోడీ ఏకీకృత సామ్రాజ్యం నిర్మించు కోవడంతో ఆ కోటలోకి ప్రవేశించే ఆస్కారం లేకుండా పోయింది. అందువల్ల ఈ సమస్యలను కేవలం పార్లమెంటులోనే చర్చించేలా విపక్షం పక్కాగా వ్యూహం పన్నాలి. అప్పుడే పార్లమెంటులో ప్రజల సమస్యలు చర్చకు వస్తాయి. అందుకు అనుగుణంగా విపక్షం నడుచుకోవాలి. పార్లమెంట్ స్తంభన అన్న పాతపద్ధతులకు దూరంగా ఉంటేనే మేలు.

## కవిత్వం

### పాలిట్రిక్స్

పార్లమెంటు ప్రారంభం
ప్రతిపక్షం ప్రాముఖ్యత,
కడవరకు కొనసాగితే
అదే గొప్ప సఖ్యత !

పక్షపాత వైఖరి
లేకుంటే స్పీకరుకు ,

# చుక్కల్లో చంద్రుడు

సీతారాం దంపతుల ఒక్కగానొక్క కూతురు వీణ. వయసు ఎనిమిదేళ్ళు. మూడో తరగతి చదువుతోంది. ఒకసారి తల్లిదండ్రులతో కలిసి బంధువుల ఇంటికి పెళ్ళికి వెళ్ళింది వీణ. అక్కడ వరసకు మేనత్త అయ్యే వాణి పరిచయమయ్యింది వీణకి. పెళ్ళినాటి రాత్రి కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వాటిలో వాణి చేసిన భరతనాట్యం పలువురి మన్ననలు పొందింది. చక్కని నృత్య ప్రదర్శన అని అందరూ వాణిని చప్పట్లు కొడుతూ అభినందించ్చిరు.

ఈ దృశ్యం వీణ మనసులో బలంగా నాటుకుంది. తను కూడా భరతనాట్యం నేర్చుకోవాలని కోరుకుంది. వాణితో "అత్తా ! నాకు నీలాగ నాట్యం చెయ్యాలనుంది, నేర్పొచ్చుగా? "అని అడిగింది.ముద్దులొలికే వీణని దగ్గరగాతీసుకుని "సెలవుల్లో మా ఇంటికి వచ్చెయ్ నేర్పుతాను"అని ముద్దులాడి వెళిపోయింది. వీణ ఎంతో సంబరపడిపోయింది.

పెళ్లి నుంచి ఇంటికి రాగానే వీణ తన తల్లితో తను సెలవల్లో వాణీ అత్త ఊరెళ్ళి నాట్యం నేర్చుకోబోతున్నానని చెప్పింది.



దానికి వాళ్లమ్మ"వాణీ అత్త వాళ్ళు ఎక్కడుంటారో తెలుసా? ఢిల్లీ లో! "అంది. "అయితే ఏం? " అమాయకంగా అడిగింది వీణ. "మనకి ఎంతో దూరం ,అంత దూరమెళ్ళి నేర్చుకోవడమేంటి, " అని ప్రశ్నించింది తల్లి. "అత్త నేర్పుతాను రమ్మంది"అంటూ పట్టుబట్టింది వీణ. "నీకు డాన్స్ నేర్చుకోవాలని కోరిక ఉంటే మనవూళ్లోనే ఒక గురువు ఉన్నారు, అతని దగ్గర చేర్పిస్తాన్లే"అని అనునయించింది. వీణ వినలేదు. "ఆ గురువు గారు ముసిలి తాత! నాకొద్దు" అని మారాం చేసింది.

కూతురి కోరిక గురించి భర్తతో చెప్పింది వీణ తల్లి. అంతా విన్న సీతారాం కూతుర్ని ఒళ్ళో కూర్చోబెట్టుకుని లాలనగా "ముందు చక్కగా చదువుకొని మంచి మార్కులు తెచ్చుకో అప్పుడు ఢిల్లీ వెళు దువుగాని"అని ఒప్పించాడు. వీణ సరే అంది.

వీణ తన స్నేహితులతో తను ఢిల్లీ వెళ్లి భరతనాట్యం నేర్చుకుంటానని చెప్పి పొంగిపోయింది. ఇదంతా గమనించిన సీతారాం భార్య," మీరు అలా మాటిచ్చిస్తే ఎలా? అది జరిగే పనేనా? "అంటూ నిలదీసింది.

"సమయం చూసుకుని నేను నచ్చచెప్తాన్లే, అంతదాక పిల్లతో నువ్వేం అనకు"అన్నాడు సీతారాం.

వీణ బడిలో తోటి విద్యార్థులు "ఢిల్లీలో చలి ఎక్కువట! వణికిపోతామట"అని కొందరు," ఢిల్లీలో మన భాష కాదుట, హిందీ అంట! నువ్వు కొట్టుకెళ్లి చాక్లెట్లు బిస్కట్లు ఎలా కొనుక్కోగలవు? "అని కొందరు ఆటపట్టించారు. వీణ ఇవేవి పట్టించుకోకుండా తండ్రి మాటను నమ్మి శ్రద్ధగా చదువుకుంటోంది.

ఒకరోజు సీతారాం బయట నుంచి వచ్చేసరికి విణ శ్రద్ధగా పరిసరాల విజ్ఞానం లో మన విశ్వం అనే పాఠం చదువుకుంటున్నాది. కూతురి చదువు చూసి పొంగిపోయాడు సీతారాం. "మీరలా సంతోషపడుతూ ఉండండి, సెలవులు రాగానే అది ఢిల్లీ పోతానంటూ బాంబు పేలుస్తుంది!"అని హెచ్చరించింది భార్య. కూతురు ఏం చదువుతోందో వింటున్నాడు సీతారాం.




"మనకు ఆకాశంలో కనిపించే నక్షత్రాలు భూమికి ఎన్నో కోట్ల మైళ్ల దూరంలో ఉన్నాయి. అందుకే ఎంతో ప్రకాశవంతమైనవి అయినప్పటికీ మినుకు మినుకు మంటూ కనబడతాయి. ఇవి భూమి కంటే ఎన్నో రెట్లు పెద్దవి. చంద్రుడు భూమికి దగ్గరగా ఉండడం వలన స్వయం ప్రకాశితం కాకపోయినా వెన్నెల భూమిని చేరుతోంది."

ఇలా చదువుకుంటూ పోతున్న కూతుర్ని చూసి సీతారాం, హమ్మయ్య! సందర్భం వచ్చింది అనకున్నాడు. వీణని పిలిచి అదే పాఠం మరొక్కమారు చదవమన్నాడు. ఆ పసి మనసుకి ఏం అర్థం అయిందో తెలుసుకుని మెచ్చుకున్నాడు. అప్పుడు చెప్పడం మొదలు పెట్టాడు "వాణీ అత్త దూరంగా ఉన్న నక్షత్రాలు లాంటిది! అదే, మనవూళ్లోనే వున్న గురువు గారు చందమామ లాంటివారు. ఎవరి దగ్గర డాన్స్ నేర్చుకుంటే బాగుంటుంది? "అని అడిగాడు. వీణకి విషయం బోధపడింది. ఏ విధంగాను ఢిల్లీలో అని చెప్పే కారణం, అవకాశం వీణకి దొరకలేదు. తర్జన భర్జన పడి పడి చివరికి "ముసిలి గురువు గారే"అనేసింది. సీతారాం దంపతుల బెంగ తీరి ఆనందపడ్డారు. భర్త సమయస్ఫూర్తిని మెచ్చుకుంది సీతారాం భార్య. కొద్ది కాలం లోనే వీణ, వాణిని మించిన నాట్యకత్తె అయి, అందరిచేతా సెభాష్ అనిపించుకుంది.

- కాండూరి వెంకట సన్యాసి రావ్
విజయనగరం, 9866088531

# అసమాన మేధావి నాగేశ రామచంద్ర రావు

## చింతామణి నాగేశ రామచంద్ర రావు జయంతి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

సి.ఎన్.ఆర్.రావుగా ప్రసిద్ధిచెందిన చింతామణి నాగేశ రామచంద్ర రావు (జూన్ 30, 1934) భారతీయ శాస్త్రవేత్త. భారతరత్న పురస్కార గ్రహీత. ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావు రసాయన శాస్త్ర పరిశోధకులు. సాలిడ్ స్టేట్, స్ట్రక్చరల్ కెమిస్ట్రీ విభాగంలో అనేక అంశాలు ఆయన వెలుగులోకి తెచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 60 విశ్వ విద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. సి.వి.రామన్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంల తరువాత భారతరత్న అవార్డుకు ఎంపికైన మూడవ శాస్త్రవేత్త.

ఆయన 1934 జూన్ 30న బెంగళూరులో ఓ కన్నడ భాష మాట్లాడే దేశస్థ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి హనుమంత నాగేశ రావు విద్యాశాఖలో ఉద్యోగి. అమ్మ నాగమ్మ. నాగమ్మ ప్రాథమిక విద్య వరకే చదివినా ఆయనకు ఆమే తొలి గురువు. భారత రామాయణ కథలు, పురందర దాసు కీర్తనలు మొదలైనవి వినిపించేది. నాన్న ఆంగ్లం నేర్పించేవారు.

రామచంద్ర ఉన్నత పాఠశాలలో ఉన్న సమయంలో భారత స్వాతంత్ర్యోద్యమం ఊపందుకుంది. ఆ సమయంలో సుభాష్ చంద్రబోస్ ఆయనకు ఆరాధ్య నాయకులు. నేతాజీ పోరాటాన్ని గురించి మిత్రులకు కథలుగా చెప్పేవారు.పదేళ్ళు నిండక మునుపే లోయర్ సెకండరీ పరీక్షల్లో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణుడయ్యారు. పెద్దయ్యేకొద్దీ స్వాతంత్ర్యోద్యమ తీవ్రత కూడా పెరిగింది. అందుకు గాంధీ టోపీ, ఖద్దరు ధరించారు.

ఉన్నత పాఠశాల విద్య పూర్తయ్యే సరికి భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కానీ మైసూరు సంస్థానం మాత్రం ఇంకా మహారాజుల పాలనలో ఉండేది. దాన్ని భారత్ లో విలీనం చేయాలంటూ పోరాటం మొదలైంది. రామచంద్ర కూడా ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. కానీ చదువును మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. పదిహేడేళ్ళకే బీయెస్సీ పట్టా అందుకుని మైసూరు విశ్వ విద్యాలయంలో సరికొత్త రికార్డు నెలకొల్పారు.

మైసూరు విశ్వవిద్యాలయం నుంచి 1951లో, ఆయన బీ.ఎస్సీ. డిగ్రీ పుచ్చుకున్న తరువాత కాశీ హిందూ విశ్వ విద్యాలయంలో మాస్టర్స్ చదువు పూర్తి చేసుకొని, 1958లో పుర్ద్యూ యూనివర్సిటీలో పి.హెచ్.డి. సాధించి బెంగళూరు లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో లెక్చరర్ గా చేరారు. 1963లో కాన్పూర్ ఐఐటీలో అధ్యాపకునిగా చేరారు. 1984-1994 మధ్య కాలంలో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కి డైరెక్టరుగా పనిచేశారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం, కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయం, కాలిఫోర్నియా విశ్వ విద్యాలయాలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. "జవహర్ లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ సైంటిఫిక్ రిసెర్చి" సంస్థను స్థాపించారు. ఇంకా చాలా ఉన్నత పదవులు నిర్వహించారు.

సాలిడ్ స్టేట్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్సు రంగాలలో సి.ఎన్. ఆర్. రావు శాస్త్రవేత్తగా ప్రసిద్ధుడ య్యారు. ట్రాన్సిషన్ మెటల్ ఆక్సైడుల గురించి అతని పరిశోధనలు ఆ రంగంలో ముఖ్యమైనవి.నానో పదార్థాల రంగంలో రావు విశేష కృషి చేశారు. 1400 పరిశోధన పత్రాలను వెలువ రించారు. 45 పుస్తకాలు ప్రచురించారు. పద్మశ్రీ, పద్మ విభూషణ్, కర్ణాటక అత్యున్నత పురస్కారం కర్ణాటక రత్న పురస్కారాలను అందుకున్నారు. 2000 సంవత్సరంలో రాయల్ సొసైటీ ఆయనకు హ్యూగ్స్ మెడల్‌ను అందించింది.

2005 నుంచి ప్రధాన మంత్రి శాస్త్రీయ సలహా మండలికి అధిపతిగా ఉన్నారు. ఆయన 1963 నుంచి 1976 వరకూ కాన్పూర్ ఐఐటీలో డీన్‌గా వ్యవహరించారు. 1984 నుంచి పదేళ్ల పాటు ఐఐఎస్‌సీకి సంచాలకులుగా పని చేశారు. సాలిడ్ స్టేట్, స్ట్రక్చరల్ కెమిస్ట్రీ విభాగానికి, పదార్థ పరిశోధన ప్రయోగ శాలకు వ్యవస్థాపక ఛైర్మన్. బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ సైంటిఫిక్ రీసెర్చ్‌కు ఆయన వ్యవస్థాపకులు.



1968 - శాంతి స్వరూప్ భట్నాగర్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రైజు, 1974 - పద్మశ్రీ, 1985 - పద్మ విభూషణ్, 2000 - కర్ణాటకరత్న, 2000- హ్యూస్ మెడల్ - రాయల్ సొసైటీ, 2004 - భారత ప్రభుత్వం నుండి ఇండియా సైన్సు అవార్డు పొందిన మొదటి వ్యక్తి. రాయల్ సొసైటీ ఆఫ్ లండన్, అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ఆండ్ సైన్సెస్, ఫ్రెంచ్ అకాడమీ, జపాన్ అకాడమీ, ఫ్రాన్సు ప్రభుత్వంచే అవార్డులు, 2013లో అత్యున్నత -భారతరత్న అవార్డు పొందారు.

# ఘనంగా ముల్కనూర్ బ్యాంక్ వ్యవస్థాపకులు ఏ.కే. విశ్వనాథరెడ్డి వర్ధంతి వేడుకలు

## నివాళులు అర్పించిన సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి

భీమదేవరపల్లి జూన్ 29 (ప్రజామంటలు):

సహకార రంగంలో ప్రపంచ స్థాయి కీర్తిని ఇనుమడింపజేసిన ముల్కనూర్ సహకార పరపతి సంఘం వ్యవస్థాపకులు అలిగిరెడ్డి కాశీ విశ్వనాథరెడ్డి 38వ వర్ధంతి వేడుకలు శనివారం సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో సంఘ సీనియర్ సభ్యులు ఏనుగు వీరమల్లారెడ్డి, ఏనుగు వీరారెడ్డి విశ్వనాథరెడ్డి విగ్రహానికి పూల దండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సంఘ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి తన తండ్రి విశ్వనాథ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, భీమదేవరపల్లి మండలం మెట్ట ప్రాంతం కావడంతో సరైన వర్షాలు లేక నీటిపారుదలకు కేవలం వర్షంపై ఆధారపడడంతో వ్యవసాయ రంగం వెనుకబడిపోయిందని, అలాంటి పరిస్థితుల్లో రైతన్నలకు అండగా ములుకనూరు గ్రామానికి చెందిన తన తండ్రి అలిగిరెడ్డి కాశీ విశ్వనాథ రెడ్డి 1956 లో నాటి కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూర్ గ్రామంలో 373 మంది రైతులతో రూ. 2300 ప్రారంభ పెట్టుబడితో ముల్కనూర్ సహకార సంఘం స్థాపించబడిందని తెలిపారు. సంఘానికి నేడు ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చిందంటే




దానికి కారణం విశ్వనాథరెడ్డి అని కొనియాడారు. నాడు కాలినడకన 14 గ్రామాలలో తిరిగి సభ్యులకు సహకార సంఘ ఆవశ్యకతను తెలియజేస్తూ, సభ్యులుగా చేర్చుకున్నారని తెలిపారు. ఇప్పటికీ వారి ఆశయాలను కొనసాగిస్తూ, సంఘ అభివృద్ధిలో ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమములో సంఘ జనరల్ మేనేజర్ మారుపాటి రాంరెడ్డి, ఉపాధ్యక్షులు కడారి ఆదాం, కార్యవర్గ సభ్యులు కూన కనుకయ్య, మారుపాటి జయపాల్ రెడ్డి, కంకల భాగ్య, గజ్జి వీరయ్య, అంబాల రాములు, ఈర్ల మూగయ్య, బేల కనుకమ్మ, కంది రవిందర్ రెడ్డి, కర్రె మహేందర్, మండ శ్రీనివాస్, చెవ్వల్ల బుచ్చయ్య, గుగ్లోతు బాషు, బొల్లపెల్లి వీరన్న సభ్యులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పిసిసి అధ్యక్షులు మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున 3 గంటలకు గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. కాగా ఆయన ఉమ్మడి ఏపీలో మంత్రిగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా సేవలు అందించారు. శ్రీనివాస్ రెండో కుమారుడు ధర్మపురి అర్వింద్ నిజామాబాద్ ఎంపీగా ఉన్నారు.

# జగిత్యాల మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం

## పాల్గొన్న ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్పర్సన్, మున్సిపల్ కమిషనర్



జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు):



మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్లో పలు వార్డుల సమస్యలపై చర్చతో పాటు మున్సిపల్ ఏజండా మరియు అదనపు ఏజండా పాస్ చేశారు. కౌన్సిల్ సభ్యులు అదనపు ఏజండాలో జగిత్యాల పట్టణ యావర్ రోడ్ 100 ఫిట్ల రోడ్ విస్తరణ అంశాన్ని కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కి సీఎం తో ఉన్న చొరవతో నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. అనంతరం మున్సిపల్ చైర్పర్సన్ ఛాంబర్ లో పత్రిక సమావేశంలో మాట్లాడారు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. సమావేశం నిర్వహించిన అనంతరం తోట గంగారాం పదవీవిరమణ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానం చేశారు. తన పదవీ కాలంలో చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయనీ బల్దియా ఛైర్పర్సన్, అధికారులు, తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, వార్డు కౌన్సిలర్స్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలిసిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు

కొండగట్టు జూన్ 29 (ప్రజామంటలు):

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ని కొండగట్టు ఆంజనేయస్వామి పుణ్య క్షేత్రంలో కలిసి మెమోరాండం సమర్పించిన బిసి సంక్షేమ సంఘం నాయకులు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.... వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిసి బిల్లు పెట్టాలని, అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ లకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ ముఖ్యమంత్రులు అఖిలపక్షంతో కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలని, బిసి లకు స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకొన్న ప్రతి బి.సి. కి సబ్సిడీతో కూడిన రుణ సహాయం అందజేయాలని, కేజి టు పిజి ఉచిత విద్యను అమలు చేయాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, బి.సి. లకు ఇస్తున్న హామీలకు చట్టబద్ధత కల్పించాలని, కేంద్రంలో బిసి లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బిసి లక ఉప ప్రణాళిక ఏర్పాటు చేయాలని, బిసి ల జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, రాబోయే కేంద్ర బడ్జెట్ లో బిసి లకు అధిక బడ్జెట్ ను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రంలో బిసి కుల గణన చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, సంయుక్త రాష్ట ఆర్గనైజింగ్ సెక్రెటరీ అలిశెట్టి ఈశ్వరయ్య, బి.సి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపురం రాంచందర్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి నాట్య సామ్రాట్ బొమ్మిడి నరేష్ కుమార్, బిసి సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షుడు రాపర్తి రవి, యూత్ కో-ఆర్డినేటర్ హృషికేష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తుల పంపిణీ చేసిన ఉపాధ్యాయులు, ఆలయ చైర్మన్ కుమార్

గొల్లపల్లి జూన్ 29 (ప్రజామంటలు):

గొల్లపల్లి మండలంలోని భీంరాజ్‌పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు ను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 1%-%5వ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు దుస్తులు అందజేశారు. ఈ ఉపాధ్యాయులు మాట్లాడుతూ%ొ%. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం మూతపడిన పాఠశాలలను సైతం ప్రారంభించిందని, ప్రతి ఒక్కరు పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ బొమ్మెన కుమార్, ఉపాధ్యాయులు రజిత, శ్యామల, సింగారపు లచ్చయ్య, సింగారపు మహేశ్, కొలగాని ఎర్రయ్య పాల్గొన్నారు.




# పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలు స్ఫూర్తివంతం

### పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్ష - ఎస్పీ అశోక్ కుమార్




జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు):

విధి నిర్వహణలో అందరి మన్ననలు అందుకొని పదవీ విరమణ పొందుతున్న ఏ.ఎస్.ఐ లు చంద్రశేఖర్, కరుణాకర్, అంజయ్య లను శాలువా, పులమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసిన ఎస్పీ. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన ఎస్పీ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని అన్నారు. విజయవంతంగా సర్వీస్ పూర్తి చేసిన అధికారుల సేవలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ వారి అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయని చెప్పారు. పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏఆర్ భీమ్ రావు డిఎస్పీ రఘుచందర్, ఐ. వేణు, ఆర్ఎస్ఐ లు కృష్ణ పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన చెక్కులను పంపిణీ చేసిన చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్

ఎల్కతుర్తి జూన్ 29 (ప్రజామంటలు):



ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కేడిసిసి బ్యాంకు నందు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన చెక్కులను ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబ సభ్యులకు (నామినీ) కేడిసిసి బ్యాంక్ డైరెక్టర్ , విశాల సహకార సంఘం చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ అందజేశారు. బ్రాంచ్ లో ముగ్గురు ఖాతాదారులు గత కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు మరణించినారు. అంతకుమునుపే వారి పేరును బీమా చేయించినందున భీమా మొత్తం ఆరు లక్షలు (ఒక్కొక్కరికి రెండు లక్షల) చొప్పున వారి కుటుంబ సభ్యులగు గునిగంటి సరిత దండేపల్లి, శ్రీమతి అయిలబోయిన లతా మాణిక్యపూర్, లోల్లేటి శ్రీలత చింతలపల్లి లకు రవీందర్ గౌడ్ మేనేజర్ స్రవంతి చేతుల మీదుగా అందజేశారు, రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ఖాతాదారుల సంక్షేమ తమ లక్ష్యం అని ప్రతి ఒక్క ఖాతాదారుడు ప్రధానమంత్రి జీవనజ్యోతి మరియు సురక్ష బీమా యోజన లో పథకంలో భాగంగా బీమా సౌకర్యం కేవలం 456 రూపాయలు చెల్లించి బీమా సౌకర్యం పొందగలరని చెప్పారు. అందులో భాగంగానే మరణించిన వారి కుటుంబ సభ్యులకు చెక్కులు అందించడం జరిగింది అన్నారు ఈ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు మేనేజర్ స్రవంతి ఫీల్డ్ ఆఫీసర్ మోడెం ప్రవీణ్, సొసైటీ వైస్ చైర్మన్ శేషగిరి, ఎఫ్ ఎల్ సి లింగమూర్తి బ్యాంకు సిబ్బంది ఖాతాదారులు పాల్గొన్నారు.

# ఇంటి ధ్రువపత్రాలు పోయినవి

### తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును

ఎల్కతుర్తి జూన్ 29 (ప్రజామంటలు):

మండల కేంద్రంలో శనివారం ఉదయం 09:45 గంటలకు మణువిత హోటల్ దగ్గర ఎడ్ల తిరుపతి రెడ్డి అనే వ్యక్తి టిఫిన్ చేస్తుండగా తన ద్విచక్ర వాహనంలో ఇంటికి సంబంధించిన ఒరిజినల్ ధృవ పత్రాలు (ఒరిజినల్ సేల్ డీడ్ 7/2016 %ఆ% 293/217, గ్రామపంచాయతీ ఒరిజినల్ పర్మిషన్ లెటర్, టాక్స్ రశీదు, తెలంగాణ ప్రభుత్వ పాస్ బుక్) పెట్టాడు. టిఫిన్ తినేసి వచ్చేసరికి వాహనంలో పత్రాలు కనిపించలేదని, ఎవరికైనా దొరికితే తిరిగి ఇవ్వగలరని వేడుకుంటున్నాడు. డాకుమెంట్స్ ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడుతుందని ప్రకటించాడు. దొరికిన వారు సెల్ ఫోన్ 8688820776 లో సంప్రదించాలని, లేదా స్థానిక పోలీస్ స్టేషన్ లో నైనా అప్పగించాలని కోరారు.

## జాబితాపూర్ శ్రీ చైతన్య స్కూల్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు):



జగిత్యాల రూరల్ జాబితాపూర్ శ్రీ చైతన్య స్కూల్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు. తనిఖీల సందర్భంగా ఆశ్చర్యపోయిన అధికారులు. హాస్టల్ లో పిల్లలకు వడ్డించే వస్తువులు కాలం చెల్లినవిగా గుర్తింపు. పాల ప్యాకెట్ నుండి నిల్వ ఉంచే పదార్థాలన్ని కుళ్లినవిగా గుర్తించారు. ఆహారపదార్ధాల్లో పురుగులు, నాసిరకంగా ఉన్నాయని తేల్చిన ఫుడ్ సేఫ్టీ అధికారులు. వాటిని చెత్తలో పడేసిన యాజమాన్యం. 3వ తరగతి నుండి 10 వ తరగతి వరకు హాస్టల్ లో ఉంటున్న వందలాది మంది విద్యార్థులు. ఇవి చూసి చర్యలకు సిద్ధమైన అధికారులు.

## జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన సాయి సృజన్

జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు):



ఇటీవల మహారాష్ట్రలో పూణే ఛత్రపతీ శివాజీ స్టేడియాంలో జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు జూన్ 22 నుంచి 26 వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో జగిత్యాల జిల్లాకు చెందిన అండర్ 14 సం. విభాగంలలో ఎం. సాయి సృజన్ పాంట్ ఫైట్టింగ్ సిల్వర్ మెడల్ సాధించాడు. పి. కృష్ణ (రాయికల్) పాంట్ ఫైల్డింగ్ లో కాంస్య పతకం సాంధించారు. ఎం. స్నిగ్ధ ప్రియా, జి. వినన్య, ఏ. హర్షిత్ పాల్గొన్నారు. సందర్భంగా క్రీడాకారులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మరియు కోచ్ రామాంజనేయులు అభినందించారు.

# స్కూల్ కు రూ 6 లక్షల విరాళమిచ్చిన పూర్వ విద్యార్థులు

## 1992 ఎస్సెస్సీ బ్యాచ్ అపూర్వ సమ్మేళనం

## వేదిక్ విద్యాలయంలో 32 ఏండ్ల నాటి స్టూడెంట్ల కోలాహాలం






సికింద్రాబాద్ జూన్ 29 (ప్రజామంటలు):
మూడు దశాబ్దాల క్రితం తమకు విద్యా బుద్దులు నేర్పించిన స్కూల్ ను మరవని, ఆనాటి విద్యార్థులు 32 ఏండ్ల తర్వాత దేశ, విదేశాల నుంచి వచ్చి, ఒకచోట చేరారు. తాము చదివిన పాఠశాల అభివృద్దికి, నిర్వాహణకు రూ 6 లక్షల విరాళాన్ని అందచేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సీతాఫల్మండి ఆర్య సమాజ్ ప్రాంగణంలోని వేదిక్ విద్యాలయం హైస్కూల్ లో 1992 సంవత్సరంలో పదవతరగతి చదివిన 80 మంది స్టూడెంట్స్ 32 ఏండ్ల తర్వాత శనివారం తిరిగి తాము చదువుకున్న స్కూల్ కు చేరుకొని ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. పరస్పరం ఆత్మీయంగా పలకరించుకొని, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు అమెరికా, యూకే, యూఏఈ, సింగపూర్, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో స్థిరపడ్డ వారు కూడ ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావడం విశేషం. ఇందుకు గాను చొరవ తీసుకున్న కొందరు ఫ్రెండ్స్ గత తొమ్మిది నెలలుగా తమ చిన్నానాటి స్నేహితుల చిరునామాలు, ఫోన్ నెంబర్లను ప్రయాసాలకు ఓర్చి కనుక్కోని, అందరికి సమాచారం అందించి, చివరికి ఇలా అందరిని ఒక చోట కలిపారు. ఆనాటి విద్యార్థులు నేడు చాలా మంది ఐటీ సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా, ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ బిజినెస్ ల్లో స్థిరపడ్డారు. శనివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో తమ స్కూల్ టీచర్లకు శాలువాలు, మెమోంటోలతో సత్కరించిన 1992 ఎస్సెస్సీ బ్యాచ్ స్టూడెంట్స్ తాము పోగు చేసిన రూ 6 లక్షల విరాళం చెక్కును స్కూల్ అభివృద్ధి, నిర్వహణకు పాఠశాల నిర్వాహకులకు అందచేశారు. అలాగే కరోనా పాండమిక్ లో తల్లిదండ్రులను కోల్పోయి, అనాథలుగా మిగిలిన 18 మంది చిన్నారులను చేరదీసి, వారిని దత్తత తీసుకున్నారు. టెన్త్ క్లాస్ వరకు వీరికి తామే ఖర్చులు భరిస్తామన్నారు. స్కూల్ కు ఈసందర్భంగా కొనుగోలు చేసిన ఆటోమెటిక్ జిరాక్స్ మెషిన్ ను బహుకరించినట్లు ఆనాటి విద్యార్థులు హరిప్రసాద్, సజేశ్, మధు (యూఎస్ఏ), ప్రకాశ్, శివకుమార్, జ్యోతి, చంద్రశేఖర్ లు తెలిపారు.

# నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిందే

## ఓయూ జేఏసీ నేతకు బీజేపీ రాష్ట్ర నాయకుల పరామర్శ



సికింద్రాబాద్ జూన్ 29 (ప్రజామంటలు):
ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం బేషరతుగా నెరవేర్చాలని, లేనిపక్షంలో నిరుద్యోగుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, బీజేవైఎం అధ్యక్షులు సెవెళ్ళ మహేందర్, రాణిరుద్రమ లు హెచ్చరించారు. గత ఆరు రోజులుగా గాంధీ ఆసుపత్రిలో నిరుద్యోగల డిమాండ్ల సాధనకు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఉస్మానియా యూనివర్శిటీ నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్ నాయక్ ను వారు పరామర్శించి, తమ సంఘీభావం తెలిపారు. నిరుద్యోగుల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ నాయకులు తీరా అధికారంలోకి వచ్చాకా, వారికిచ్చిన హామీలను మరవడం సరికాదన్నారు. అమరణ దీక్ష చేస్తున్న మోతీలాల్ నాయక్ కు ఏదేని హాని జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, వినీత్, అరవింద్, ఆదిత్య, ఆయుష్ పాల్గొన్నారు.



# ప్రజామంటలు వార్తకు స్పందన

## రోడ్డుకు మరమత్తులు

ములుకనూర్ జూన్ 29 (ప్రజామంటలు):
"చినుకు పడితే ఈ దారిలో నడవడం కష్టమే...... రోడ్డంతా బురదమయం ..... ముల్కనూర్ బీసీ కాలనీ వాసుల ఇక్కట్లు...." అనే శీర్షికన ఈ నెల 27న ప్రజామంటలు వార్త పత్రికలో ప్రచురితమైన కథనానికి ములుకనూర్ గ్రామ పంచాయితి సెక్రెటరీ జంగం పూర్ణచందర్ వెంటనే స్పందించి శుక్రవారం జేసిబితో గుంతలను పూడ్చారు. వివరాల్లోకి వెళితే ములుకనూరు స్టేట్ బ్యాంక్ ఎదురుగా దారి బీసీ కాలనీ, కొత్తపల్లికి వెళ్లే దారిలో వర్షం పడితే చాలు నీరు నిలవడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. తాత్కాలికంగా నైనా ప్రజల ఇక్కట్లు తీరడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే కాలనీకి వచ్చే పలు దారులు కూడా గుర్తించి సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు. సకాలంలో స్పందించి సమస్యను పరిష్కరించిన అధికారులకు కృతజ్ఞతలు చేశారు. అలాగే సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన ప్రజామంటలు తెలంగాణ జాతీయ దినపత్రికను పలువురు అభినందించారు.

# శ్రీవల్లి పుత్తూరు పీఠాధిపతి జగిత్యాలకు రాక

జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు):
ప్రముఖ జ్యోతిష, వాస్తు, పౌరాణిక, వేద పండితులు, శ్రీమాన్ నంబి వేణు గోపాల ఆచార్య కౌశిక గృహం వాసుదేవ సదనంలో తమిళనాడు శ్రీవల్లి పుత్తూరు పీఠాధి పతులు శత గోప రామానుజ జీయర్ స్వామివారు తీర్ద గోష్ఠి జరిపారు. ఈ తీర్థ గోష్ఠిలో పట్టణం లోని ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు, మాతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారని, స్వామి వారి ఆశీర్వాదం, తీసుకున్నారని, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారు భక్తులను ఉద్దేశించి అనుగ్రభాషణం చేశారు.







డాక్టర్స్ డే సందర్భంగా జగిత్యాల ఖిలాగడ్డ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్లను సన్మానిస్తున్న శాతవాహన హై స్కూల్, జగిత్యాల విద్యార్థులు.



# వంగర పోలీస్ స్టేషన్లో ఆకస్మిక తనిఖీలు

## రికార్డులు పరిశీలించిన కాజీపేట ఏసిపి తిరుమల్



భీమదేవరపల్లి జూన్ 29 (ప్రజామంటలు):
మండలంలోని వంగర పోలీస్ స్టేషన్లో కాజీపేట ఏసిపి తిరుమల్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు, గదులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్టేషన్ రికార్డ్స్ అన్ని పరిశీలించి, తగిన సూచనలు చేశారు. సీసీ కెమెరాలు అన్ని పనిచేస్తున్నయా లేదా? అని తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి డ్యూటీ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని, శాఖా పరమైన సమస్యలు ఉంటే వెంటనే తెలపాలని సూచించారు. బాధితులకు సరైన న్యాయం చేయాలని, రోజుల తరబడి స్టేషన్ చుట్టూ తిప్పకుండా చట్టపరంగా కేసులు నమోదు చేయాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్, వంగర ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వాగోడ్డు రామన్నపల్లేలో డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ ధివాస్ జయంతి ఉత్సవాలు



ఇల్లందకుంట జూన్ 29 (ప్రజామంటలు):
డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ ధివాస్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఇల్లందకుంట మండల బీజేపీ అధ్యక్షులు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో వాగొడ్డు రామన్నపల్లి గ్రామం లో చెట్లు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇంచార్జీలు రాజేంధర్, బూత్ అధ్యక్షులు పుట్ట శ్రీధర్, మరియు నరెడ్ల అనిల్, అన్నారపు రాజేష్, తేపా సునీల్, అన్నారపు శ్రీకాంత్, గజ్జె సాంబయ్య, పుట్ట తిరుపతి, నరెడ్ల భద్రయ్య, పుట్ట రాజు, బోడ రాకేష్, రసమల్లె రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొండగట్టు పుణ్య క్షేత్రానికి తీసుకురాబడిన శ్రీ రాముని వెండి ధనస్సు



జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు):
దేశమంతటా దర్శించుకున్న అయోధ్య నుండి తీసుకుని వచ్చిన శ్రీ రాముని వెండి ధనస్సు శ్రీ శ్రీనివాస శాస్త్రి అన్ని పుణ్యక్షేత్రాలను దర్శించుకుని అదేవిధంగా అందరు పీఠాధిపతులతో ప్రత్యేకంగా తీసుకొచ్చి కొండగట్టు పుణ్య క్షేత్రానికి తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా హిందు వాహిని, విశ్వహిందూ పరిషత్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు అందరు కూడా ఇక్కడికి రావడం జరిగింది. ఇక్కడ హిందూ బంధువులు అందరూ కూడా దీనిలో పాల్గొని విజయవంతం ఈ కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేముల సంతోష్, ముసిపట్ల లక్ష్మీనారాయణ, తిరుపురం రాంచందర్, బొమ్మిడి నరేష్ కుమార్, అరుణ్. సంతోష్, రాజ్ కుమార్, నరేష్, హిందూ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ డెయిరీ ఫెడరేషన్ ఆసియా, పసిఫిక్-2024

## ప్రశంసా పత్రాన్ని అందుకున్న ముల్కనూర్ మహిళా డెయిరీ - హర్షం వ్యక్తం చేసిన డెయిరీ మహిళా సభ్యులు






భీమదేవరపల్లి జూన్ 29 (ప్రజామంటలు):
కేరళ రాష్ట్రం కొచ్చిలో జరిగిన ఐ.డి.ఎఫ్ (ఇంటర్నేషనల్ డెయిరీ ఫెడరేషన్) రీజనల్ డెయిరీ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో ఆసియా - పసిఫిక్ 2024 సమావేశంలో ముల్కనూర్ మహిళా డెయిరీకి ప్రశంసా పత్రాన్ని డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీకి అందజేశారు. జూన్ 26 నుండి 28 వరకు మూడు రోజులు కొచ్చిలో జరిగిన ఫార్మర్ సెంట్రిక్ ఇన్నోవేషన్ ఇన్ డెయిరీ కార్యక్రమంలో సంఘ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామీణ మహిళలతో ములుకనూరు మహిళా సహకార డెయిరీ విధానాలు, పనితీరు, విజయాలకు గాను ప్రశంసా పత్రం అందించారని భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఆసియా, పసిఫిక్ దేశాల డెయిరీల ప్రతినిధులు పాల్గొన్నారు. డెయిరీ టెక్నాలజీస్, వెటర్నరీ సైడ్ అండ్ రీసెర్చ్ డెవలప్మెంట్, డెయిరీలో మహిళల భాగస్వామ్యంపై వారు చర్చించారు. ఈ సదస్సులో వక్తగా డెయిరీ ప్రెసిడెంట్ వ్యవహారించగా, మేనేజర్ భాస్కర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డెయిరీ అభివృద్ధి, విధానాలు వివరించారు. ఈ సమావేశంలో అతిథులుగా బ్రెజెల్లా ఐడిఎఫ్ అధ్యక్షులు, భారత పశుసంవర్ధక శాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ, ఐడిఎఫ్ ప్రాంతీయ డైరెక్టర్ శ్రీ లారెన్స్ రెలెంట్స్ మరియు ఎన్.డి.డి.బి చైర్మన్ మనీషా షా పాల్గొన్నారు

# ఉభయ రాష్ట్రాల సమస్యలపై చర్చించాలి

## ఉమమడిగా పోరాడితేనే సానుకూలత

హైదరాబాద్,జూన్ 29 (ప్రజా మంటలు): ఆర్థికస్థితి వెక్కిరిస్తున్న వేళ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీపై గురుతర బాధ్యతలు ఉన్నాయి. ఎన్నికల ముందు లేవనెత్తిన వివిధ సమస్యలను నెమరు వేసుకుని పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రధానంగా ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సి ఉంది. ఉదార పథకాలను పక్కన పెట్టి బొక్కసం నిండుకునేలా మెల్లగా అడుగులు వేయాలి. అనేక పథకాలను సమీక్షించి కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఆర్థిక క్రమశిక్షణ సాధ్యం కాదు. ఇందులో ప్రధానంగా ధరణి అక్రమాలను నిరోధించాలి. రైతుబంధును సరళీకరించాలి. చిన్న, సన్నకారు రైతులకు మాత్రమే సాయం అందేలా చూడాలి. ఫామ్‌హౌజ్‌ల కోసం కొనుకున్న భూములకు రైతుబంధు అమలు చేయకుండా చూడాలి. కిలో రూపాయి బియ్యంపైనా సమీక్షించాలి. మార్కెట్లో బియ్యం ధరలు మండిపోతున్నాయి. ఈ క్రమంలో కిలో రూపాయి బియ్యం ఇవ్వడం దోచి పెట్టడమే తప్ప మరోటి కాదు. ఇబ్బడిముబ్బడిగా ఉన్న తెల్లకార్డులను తొలగించాలి. పేదరికంపై హేతుబద్దత ఆధారంగా ముందుకు సాగాలి. డబ్బుల పందేరం చేసే కార్యక్రమం లేదా పథకం ఏదైనా సమీక్షించాల్సిందే. ఎస్సీ కార్పోరేషన్ను పునరుద్దరించి దళితులు స్వయంశక్తితో ఎదిగేందుకు వడ్డీరహిత రుణాలు ఇచ్చి వారిని ప్రోత్సహించాలి. అలాగే ఇబ్బడిముబ్బడిగా సలహాదారులను పెట్టే సంప్రదాయాన్ని పక్కన పెట్టాలి. వీటికి లక్షల్లో జీతాలు తగలేసి, ప్రభుత్వ ఖజానాను దివాళా తీయించడం మానుకోవాలి. ఇకపోతే విభజన సమస్యలపై కేంద్రంతో పోరాడి సాధించాలి. ఆనాడు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పార్లమెంట్ వేదికగా నిలదీయడంలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపిలు ముందుండాలి. ఎపి విభజన జరిగాక ఇరు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి పెంచలేక పోయాయి. అందువల్ల కేంద్రం నిర్మాణా త్మక సహకారం అందించలేక పోయింది. ఎపి రాజధానిపై కేంద్రం చేతులెత్తేసింది. విశాఖ స్టీల్ ఆందోళనలను పట్టించుకోవడంలేదు. కడప ఉక్కును పక్కన పెట్టారు. బయ్యారం ఉక్కు ఊసే లేదు. ఇక ఏంచేశారో చెప్పడానికి ఏమీ లేదు. ఉభయరాష్ట్రాల మధ్య సమస్యలను పట్టించుకోలేదు. కృష్ణా, గోదావరి జలవివాదాన్ని కూడా సత్వరంగా పరిష్కరించాలన్న ఆలోచన చేయలేదు. విభజన సమస్యల పరిష్కారం పేరుతో కమిటీ వేసినా..విభజన హామీలపై మాత్రం కేంద్రం నోరు మెదపడం లేదు. దీనిపై ఈ రెండు రాష్ట్రాలు నేరుగానే పోరాడాల్సిన అవసరం ఇప్పుడు వచ్చింది. సమస్యలను నాన్చకుండా త్వరగా పోరాడితేనే మంచిది. స్థానిక బిజెపి నేతలు కూడా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సమస్యలు ప్రస్తావించి సాధించే తెలివిని ప్రదర్శించలేదు. దూకుడు రాజకీయాలతో, వారు చేస్తున్న విన్యాసాలు అభాసుపాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో గత విభజన సమయంలో ఇచ్చిన హామీలను ముందుకేసి..అసలు కేంద్రం ఎందుకిలా వ్యవహరిస్తున్నదో నిలదీయాలి. విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రం రాష్ట్రానికి ద్రోహం చేసినా వైసిపి పెద్దగా పోరాడలేదు. మోడీ బురిడీ కొట్టించి కాలయాపన చేయడంతో పదేళ్లు గడిపేశారు. గతంలో దీర్ఘకాలం బిజెపితో టిడిపి సాగించిన పొత్తు రాజకీయాలు ఇప్పుడు అవకాశంగా తీసుకోవాలి. ఇక్కడ కూటమి ప్రభుత్వం ఉన్నందున తగిన చొరవ తీసుకునేలా చంద్రబాబు కృషి చేయాలి. కృష్ణపట్నం జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం అదానీకి ధారాదత్తం చేస్తున్నది. గంగవరం పోర్టును అప్పగించేశారు. సహకార చెక్కర, పాలసంఘాలను దెబ్బతీశాయి. ప్రత్యేకహోదాను పక్కనపెట్టి ఇద్దరూ కీచులాడుకున్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలో ఎన్‌డిఎ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినందున గతంలో లాగా దూకుడు ప్రదర్శించకపోవచ్చు. కాబట్టి ఇరు తెలుగు రాష్ట్రాల నేతలు ఉమ్మడిగా పోరాటం చేస్తే మంచిది. తెలుగు రాష్ట్రాల భవిష్యత్ ఏమిటన్నది ఉమ్మడిగా చర్చించాల్సిన అవసరం ఉన్నది. ప్రధానంగా తెలంగాణకు సంబంధించి ఇక్కడి కాంగ్రెస్ గట్టిగా నిలదీయాల్సిందే. బిజెపి నేతలను కూడా నిలదీయాలి. లేకుంటే సమస్యలు సమస్యలుగానే ఉంటాయి.

# ఉమ్మడి జిల్లాలో చురుకుగా కాంగ్రెస్

## స్థానిక ఎన్నికలే లక్ష్యంగా సాగుతున్న రాజకీయం

## పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టామన్న షబ్బీర్ అలీ



నిజామాబాద్, జూన్ 29 (ప్రజా మంటలు): ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి నేతలకు అవకాశం దొరికింది.ఇప్పటికే అంతా మళ్లీ పాతగూటికి చేరుతున్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేలా అడుగుల వేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం తో గత ఆరనెలలుగా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ కార్యకలాపాలు పెరిగాయి. ఇప్పుడు కార్యకర్తలు కూడా ధైర్యంగా కార్యక్రమాలను ముందుకు తీసుకుని వెళుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం, షబ్బీర్ అలీ ప్రభుత్వ సలహాదారు కావడంతో అనేక కార్యక్రమాలకు అవకాశం ఏర్పడింది. జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీమంత్రి షబ్బీర్ అలీ ఇప్పటికే పలు కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. జిల్లాలో పార్టీ విస్తరణకు గల అవకాశాలను అందిపుచ్చు కుంటున్నారు. ప్రధానంగా జిల్లాలో పసుపు, ధాన్యం, ఎర్ర జొన్న రైతుల సమస్యలపై పోరాడడం ద్వారా రైతుల్లో కొంత సానుభూతిని సాధించారు. ఈ విషయాల్లో బిఆర్ఎస్, బిజెపిలు విఫలం అయ్యాయని షబ్బీర్ అలీ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రైతు సంక్షేమానికి పెద్దపీట వేసామని అన్నారు. త్వరలోనే రుణమాఫీతో వారిలో మరింత భరోసా పెరగనుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రైతులకు ఒకే దఫాలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీకి అడుగు పడుతోంది. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ అనుసంధానం, పంట బీమా, వరికి క్వింటాల్‌కు రూ.2500 చెల్లిస్తామన్నారు. రేవంత్ రెడ్డి కూడా ఇప్పటికే పసుపు రైతుల పోరాటానికి మద్దతుగా నిలిచి ఇక్కడి కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపారు. ఎన్నికల ఫలితాలు కూడా అనుకూలంగా రావడంతో ఇంతకాలం స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలకు నయాజోష్ వచ్చిందని షబ్బీర్ అలీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గతంలో ఆర్మూర్ లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజీవ్ రైతు భరోసా దీక్ష విజయవంతమైంది. ఆశావహులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. దీనికితోడు మాజీ ఎంపీ మధుయా ష్కీ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ ల వల్ల అదనపు బలంగా మారింది. జిల్లా రాజకీయాల్లో వీరు కూడా తమవంతుగా ఉత్సాహం నింపుతున్నారు. మధుయాష్కీ నిజామాబాద్ పార్లమెంట్ నుంచి రెండు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించారు. ఆయనకు అధినాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అలాగే, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్‌తో నాయకులకు, కార్యకర్తలకు చనువు వుంది. ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా ఉన్నప్పటి నుంచి అందరితో సంబంధాలు ఉన్నాయి. మొత్తంగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భావిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీలో క్రియాశీలకంగా ఉండాలని చాలామంది ముందుకు వస్తున్నారని అన్నారు. గత మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. అనేక చోట్ల పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా దొరకలేదు. కాంగ్రెస్‌కు నాయకత్వ కొరత ఉండడంతో అనేక మంది బీజేపీ వైపు మొగ్గు చూపారు. ఆ పార్టీ టికెట్ కోసం పోటీ పడ్డారు. స్థానికంగా కాంగ్రెస్ నాయకులను పట్టించుకునే వారు లేకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. ఈ సమస్యలు ఇక ఉండవని షబ్బీర్ అభిప్రాయపడ్డారు. మెల్లగా పాతవారందరూ మళ్లీ కాంగ్రెస్ పార్టీ గూటికి వస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్లిన వారికి ఇప్పుడు మళ్లీ అవకాశం వచ్చింది. మున్ముందు స్థానిక ఎన్నికలు ఉండడంతో పరిస్థితి మారుతోంది. స్థానిక ఎన్నికల్లో జిల్లాలో బలం చాటుతామని షబ్బీర్ అలీ కూడా ధీమాగా ఉన్నారు.

# విజయవాడ-జగదల్‌పూర్ హైవేలో మార్పులు

## రహదారుల నిర్మాణానికి పలు ప్రతిపాదనలు: తుమ్మల



ఖమ్మం,జూన్ 29 (ప్రజా మంటలు): విజయవాడ- జగదల్‌పూర్ హైవే విషయంలో కొన్ని మార్పులు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రహదారుల నిర్మాణంలో కేంద్రానికి పలు ప్రతిపాదనలు పెట్టినట్లు చెప్పారు. 'ఖమ్మం జిల్లాలో కొన్ని గ్రామాల మీదుగా హైవే వెళు_నందున బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరాం. ఖమ్మం చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మాణానికి గతంలోనే ప్రతిపాదనలు చేశాం. గత ప్రభుత్వం రూ.180 కోట్లు కేటాయించలేక రింగ్‌రోడ్డును పక్కన పెట్టేసింది. భద్రాచలం పట్టణంలోనూ కొన్ని రోడ్ల విస్తరణకు ఆమోదం లభించింది. భద్రాచలం నుంచి ఏటూరు నాగారం వరకు.. జగ్గయ్యపేట నుంచి వైరా, తల్లాడ మీదుగా కొత్తగూడెం వరకు 4 లైన్ల హైవేకి ప్రతిపాదనలు పంపించాం' అని మంత్రి తెలిపారు. కోదాడ-ఖమ్మం మధ్య రూ. 1.039 కోట్లతో నిర్మించిన 32 కి.మీ రహదారి ఆగస్టు 30 కల్లా అందుబాటులోకి వస్తుందన్నారు. ఖమ్మం-కొరివి మధ్య రూ.445 కోట్లతో 37 కి.మీ రహదారి నిర్మాణానికి గతంలోనే అనుమతులిచ్చామని తెలిపారు. దీని నిర్మాణానికి మరో రెండేళ్లు పడుతుందని వెల్లడించారు.

# ఆదిలాబాద్ మాజీ ఎంపి రామేశ్ రాథోడ్ మృతి

## ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృత్యువాత

## సంతాపం తెలిపిన సిఎం రేవంత్, కేంద్రమంత్రులు, బిజెపి నేతలు

ఆదిలాబాద్,జూన్29 (ప్రజా మంటలు): ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్(59) కన్నుమూశారు. శుక్రవారం అర్ధరాత్రి ఉట్నూర్‌లోని తన నివాసంలో అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకువస్తుండగా.. మార్గమధ్యంలో ఇచ్చోడ వద్ద తుది శ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని ఉట్నూర్‌కు తరలించారు. రమేష్ రాథోడ్ మృతి పట్ల పలువురు నేతలు సంతాపం ప్రకటించారు. తెదేపా తరఫున 1999లో ఖానాపూర్ ఎమ్మెల్యేగా రమేష్ రాథోడ్ ఎన్నికయ్యారు. 2009లో ఆ పార్టీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా తెదేపా నుంచి భారాసలో చేరారు. అనంతర పరిణామాల్లో కాంగ్రెస్‌లో చేరి 2019లో ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత భాజపాలోకి వెళ్లారు. ఎంపీ టికెట్ కోసం ప్రయత్నించారు. ఆయన వయస్సు 58 సంవత్సరాలు. శనివారం ఉదయం ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా.. మార్గమధ్యంలో ఆయన మరణించారు. శుక్రవారం రాత్రి రమేష్ రాథోడ్ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి ఆయన్ని తరలించారు. అయితే శనివారం ఉదయం మెరుగైన వైద్య చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆయన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఆ క్రమంలో ఆయన మృతి చెందారు. ఖానాపూర్ ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గానే కాకుండా లోక్‌సభ సభ్యుడిగా రమేష్ రాథోడ్ పని చేశారు. తెలుగుదేశం, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో రమేశ్ రాథోడ్ కీలక నేతగా పని చేశారు. ఆయన స్వస్థలం నార్నూర్ మండలం తాడిహాత్నూర్. రాతోడ్ మృతికి సిఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన మృతి తెలంగాణకు తీరని లోటని అన్నారు. నిబద్దత కలిగిన రాజకీయ నేత అని అన్నారు. మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నాయకుడు రమేశ్ రాథోడ్ మృతిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దిగ్భాం÷-రతి వ్యక్తం చేశారు. రమేశ్ రాథోడ్ బీజేపీలో క్రియాశీలకంగా పనిచేశారన్నారు. మొన్నటి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లోనూ చాలా ఉత్సాహంగా పార్టీకోసం కష్టపడ్డారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కీలకంగా వ్యవహరించారని చెప్పారు. జడ్పీటీసీగా ప్రస్థానం ప్రారంభించి.. జడ్పీచైర్మన్ గా, ఎమ్మెల్యేగా, ఎంపీగా నిరంతరం ప్రజలతో గడపడానికే ఇష్టపడే వారన్నారు. ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడే.. రమేశ్ రాథోడ్ ఇకలేడనే వార్త బాధాకరమన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన మిృతి పార్టీకి తీరని లోటని బిజెపి ఎంపి లక్ష్మణ్, మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇది దిగ్భ్రాంతి కలిగించే విషయమని అన్నారు.

# మహిళలకు ఆర్థికచేయూత

## గ్రామాల్లో మీ సేవ కేంద్రాల అప్పగింత

## శిక్షణతో పాటు, రుణ మంజూరుకు కసరత్తు

హైదరాబాద్,జూన్29(ప్రజా మంటలు): స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో మీ సేవ కేంద్రాలను కూడా మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించింది. ఈ సేవ, మీ సేవ పేరుతో కేంద్రాలను మంజూరు చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ ప్రజలకు మీ సేవ ద్వారా ఆన్‌లైన్ సేవలు అందడంతో పాటు వాటి నిర్వహణ ద్వారా మహిళా సంఘాలు కూడా ఆర్థికంగా లాభం పొందనున్నాయి. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 4525 మీసేవ కేంద్రాలు ఉన్నాయి. అయితే వీటిలో మూడు వేల వరకు పట్టణ, నగర ప్రాంతాల్లోనే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువగా ఉన్నాయి. పన్నెండు వేలకుపైగా పంచాయతీలు ఉంటే.. వెయ్యి గ్రామాల్లోనే మీ సేవ కేంద్రాలున్నాయి. ఈ సేవ కేంద్రాలు అందుబాటులో లేకపోవడం వల్ల చిన్న పనులకు కూడా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని గమనించిన తెలంగాణ ప్రభుత్వం మహిళా సంఘాలకు వీటిని కేటాయించాలని నిర్ణయించింది. గ్రామాల్లో మీ సేవ కేంద్రాలు పెట్టుకునేందుకు స్వయం సహాయ సంఘాలకు రెండున్నర లక్షల వరకూ రుణం మంజూరు చేయనున్నారు. ఈ ధనంతో ఈ సేవ కేంద్రాలకు అవసరమైన సాంకేతిక పరికరాలను కేటాయిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పాటు చేస్తారు కాబట్టి.. ఆ కేంద్రాలకు అవసరమైన స్థలం కూడా ప్రభుత్వ భవనాలలోనే లభ్యతను బట్టి కేటాయించే అవకాశం ఉంది. ఇంటర్ పాసైన వారిని ఆపరేటర్లుగా పని చేసేందుకు శిక్షణ ఇప్పిస్తారు. మీ సేవ అధికారుల పర్యవేక్షణలో ఇవి పని చేస్తాయి. మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు ముందుకొచ్చే సంఘాలను ఎంపిక చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. ఆగస్టు 15నాటికి గ్రామాల్లో మీసేవ కేంద్రాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. మహిళల అభ్యున్నతికి రేవంత్ సర్కార్ పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇటీవల మహిళాశక్తి క్యాంటీన్లను కూడా ప్రారంభించారు. నేఎస్‌హెచ్‌జీ సభ్యులతో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయిస్తున్నారు. వరంగల్ పర్యటనలో రేవంత్ రెడ్డి మహిళా శక్తి క్యాంటిన్లను ప్రారంభించారు. మహిళా సంఘాలకు అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రేవంత్ సర్కార్ క్యాంటీన్ విస్తీర్ణంకు అనుగుణంగా ఒక్కోదాంట్లో ఐదు నుంచి 20 మంది సభ్యులు పనిచేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆసక్తి, కష్టపడే తత్వం కలి గిన 50 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులను ఎంపిక చేశారు. శిక్షణ కూడా ఇచ్చారు. ఇప్పుడు మీ సేవ కేంద్రాలను కూడా మహిళా సంఘాలకు కేటాయిస్తూండటంతో.. మహిళలు పెద్ద ఎత్తున ఆర్థికంగా నిలబడే అవకాశం కలుగుతోంది.

# ప్రజాపాలనలో ఇంతటి నిర్బంధమా?

## గృహ నిర్బంధంపై బిఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డి



వరంగల్,జూన్29 (ప్రజా మంటలు): ప్రజా పాలనలో పోలీస్‌ల పహారాలు, నిర్బంధాలు ఎందుకు అని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం అంటూ బీరాలు పలుకుతూ ప్రతిపక్ష నాయకులపై ఈ అంక్షలు ఎందుకు అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా ఏనుగుల రాకేశ్ రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. రాకేశ్ రెడ్డి సహా 40 మంది మంది ముఖ్య కార్యకర్తల నిర్బంధించారు. దీంతో ప్రభుత్వం తీరుపై రాకేశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలల పాలనకే ఇంత అభద్రతాభావమా.. ఇంతటి అరాచకమా? అని ఏనుగుల రాకేశ్‌రెడ్డి మండిపడ్డారు. తమకు కొట్లాడటం కొత్తకాదని తెలిపారు. కేవలం నిర్మాణాత్మక సూచనలను ప్రజల కోణంలో విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి సహా సగం కేబినెట్, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఓ ప్రైవేటు హాస్పిటల్ ఓపెనింగ్ కోసం ఎగవేసుకుని వస్తున్నారని.. అయినప్పటికీ వరంగల్‌కు సీఎం వస్తున్నాడన్న వాతావరణమే ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో తన ప్రెస్ మీట్ తర్వాతే సీఎం పర్యటనలో మార్పులు వచ్చాయని ఏనుగుల రాకేశ్ రెడ్డి అన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రశ్నించేదాక సీఎం హోదాలో ఎలా పర్యటించాలో ఆయనకు తెలియడం లేదని ఎద్దేవా చేశారు. కాకతీయ కళాతోరణాన్ని అధికారిక చిహ్నం నుంచి తొలగించడంపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాకతీయ కళా తోరణం రాచరిక దర్పం అన్న వ్యాఖ్యలు ఓరుగల్లు ప్రజలను తీవ్రంగా బాధించాయని ఏనుగుల రాకేశ్ రెడ్డి అన్నారు. కాబట్టి, సీఎం రేవంత్ రెడ్డి ఆ మాటలు వెనక్కి తీసుకొని, ఓరుగల్లు ప్రజలకు బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వరంగల్ దాటేలోగా కాకతీయ తోరణం తొలగింపుపై స్పష్టత ఇవ్వాలన్నారు. లేకపోతే, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులంతా రేవంత్ రెడ్డి ఇంటిముందు టెంటు వేసుకొని ధర్నా చేయాలని సూచించారు. లేదంటే మీ క్యాంప్ ఆఫీస్‌ల ముందు ప్రజలు కుర్చుకుంటారని చెప్పారు. కడుపు మీద కొట్టినా ఓర్చుకుంటాం. కానీ, మా ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు.

# శ్రీవారిదర్శనంలో పారదర్శకతకు పెద్దపీట

## దరఖాస్తులతో ఆధార్ అనుసంధానం

## సమీక్షలో ఇవో జె.శ్యామలరావు



తిరుమల,జూన్29 (ప్రజా మంటలు): శ్రీవారి భక్తులకు టీటీడీ అందిస్తున్న ఆన్‌లైన్ అప్లికేషన్ సేవలకు ఆధార్‌ను లింక్ చేయడం ద్వారా పారదర్శకతతో పాటు దళారీ వ్యవస్థను నియంత్రించేందుకు వీలవుతుందని టీటీడీ ఈవో జె.శ్యామలరావు చెప్పారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం యూఐడీఏఐ నుంచి వచ్చిన అధికారులు, టీసీఎస్ జియో, టీటీడీ ఐటీ విభాగంతో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఇదివరకే టీటీడీ దర్శనం, వసతి, ఆర్జిత సేవలు, శ్రీవారి సేవ తదితర సేవలను ఆన్‌లైన్ ద్వారా భక్తులు బుక్ చేసుకునేందుకు వీలు కల్పిస్తోందన్నారు. ఈ అప్లికేషన్ల ద్వారా కూడా దళారుల బెడద తప్పడం లేదని, వాటిని నియంత్రించడానికి ఆధార్ లింక్ చేసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సింది గా ఐటీ అధికారులకు సూచించారు. ఆధార్ ద్వారా యాత్రికుల గుర్తింపు, పరిశీలన, బయోమెట్రిక్ వెరిఫికేషన్ ఎలా చేయాలి, ఆధార్ డూప్లికేషన్ ఎలా నిరోధించాలి తదితర అంశాలపై చర్చించారు. అంతకుముందు ఆధార్‌ను ఏ విధంగా అప్లికేషన్ లకు లింక్ , తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ సంగీత, అధికారులు శ్రీనివాస్, రాజశ్రీ గోపాలకృష్ణ, అనుకూర చౌదరి, సంజీవ్ యాదవ్, టీటీడీ జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, సీవీ అండ్ ఎస్ఓ నరసింహ కిషోర్, అధికారులు పాల్గొన్నారు.

# మొదలైన అమర్‌నాథ్ యాత్ర

## భారీగా భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రారంభం

జమ్ము,జూన్29 (ప్రజా మంటలు): భక్తులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న అమర్ నాథ్ యాత్ర శనివారం మొదలయింది. పవిత్ర గుహలో శివలింగ దర్శనానికి భక్తులు భారీ ఎత్తున్న రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 48 కిమీ. నున్వాన్–పహల్గామ్ మార్గం, 14 కిమీ. బల్తాల్ మార్గం గుండా యాత్రికుల మొదటి బ్యాచ్ కదిలింది. రెండు మార్గాలల్లోని యాత్రికుల బ్యాచ్ లను సంబంధిత డిప్యూటీ కమిషనర్లతో పాటు పోలీసు, సివిల్ అధికారులు సాగనంపారు. జమ్మూలోని భగవతి నగర్ లోని యాత్రి నివాస్ బేస్ క్యాంపు నుంచి 4603 భక్తుల మొదటి బ్యాచ్కు జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ సిన్హా జెండా ఊపి పంపారు. 1881 మంది యాత్రికులు ఉన్న రెండో బ్యాచ్ ను కూడా భగవతి నగర్ బేస్ క్యాంప్ నుంచి పంపారు. భక్తుల రక్షణ కోసం పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఇండో–టిబెటన్ బార్డర్ పోలీసులను మోహరించారు. వైమానిక నిఘా కూడా పెట్టారు. ఇదిలావుండగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పవిత్ర యాత్రకు ఉపక్రమించిన యాత్రికులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరమశివుడి ఆశీస్సులతో భక్తులందరూ వర్ధిల్లాలని కోరారు.



# శ్రీవారి లడ్డు నాణ్యత మరింత పెంచండి

## టీటీడీ ఈవో జె.శ్యామలరావు ఆదేశాలు


తిరుపతి, జూన్29 (ప్రజా మంటలు): శ్రీవారి లడ్డు ప్రసాదాలు మరింత రుచిగా, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో జె. శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం ఈవో కార్యాలయంలో టీటీడీ అధికారులు, డైరీ నిపుణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, మరింత నాణ్యమైన నెయ్యిని ఎలా కొనుగోలు చేయాలి, కొనుగోలు చేసిన నెయ్యిని ప్రస్తుతం పరీక్షిస్తున్న విధంగా కాకుండా మరింత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా పరీక్షించాలి తదితర అంశాలపై, అందుకు తీసుకోవలసిన మార్పులను తెలియజేయాలని ఆయన నిపుణులను కోరారు. తరువాత ప్రముఖ డెయిరీ నిపుణులు విజయభాస్కర్ రెడ్డి, సురేంద్రనాథ్ లడ్డు నాణ్యత పెంచేందుకు ఎస్ఎస్ఐ నిబంధనల ప్రకారం నాణ్యమైన నెయ్యిని ఎలా తయారు చేస్తున్నారు, ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా అగ్ మార్క్, టీటీడీ నిబంధనల ప్రకారం నెయ్యి నాణ్యత ఎలా ఉండాలనే విషయమై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారు వివరించారు. నాణ్యమైన నెయ్యి యొక్క ప్రామాణిక విలువల గురించి వారు తమ పిపిటిలో తెలిపారు. త్వరలో లడ్డు నాణ్యత మరింత పెంచడానికి అవసరమైన నెయ్యి సమకూర్చుకోవడానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామన్నారు. ఈ సమావేశంలో జెఈఓ గౌతమి, ఎస్వి గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, కొనుగోలు జిఎం మురళీకృష్ణ, ఎస్ఇ–2 జగదీశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# సిఎం పెన్షన్ల పంపిణీ షెడ్యూలు ఖరారు

## పెనుమాకలో నేరుగా అందచేయనున్న బాబు

అమరావతి,జూన్29 (ప్రజా మంటలు): ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. తాడేపల్లి మండలం పెనుమాకలో పెన్షనర్ల ఇంటికి వెళ్లి పెన్షన్లను తన చేతుల మీదుగా అందజేయనున్నారు. దేశ చరిత్రలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సీఎం పెన్షన్ పంపిణీ చేయడం ఇదే తొలిసారి. పేదింటి మహిళకు సీఎం స్వయంగా పెన్షన్ అందచేయడం ఇదే ప్రథమం. సీఎం పర్యటనతో పెనుమాక వచ్చి అధికారులు పరిశీలించారు. పెన్షన్ లబ్ధిదారుల జాబితా అధికారులు సేకరించారు. అయితే మంగళగిరి నియోజకవర్గం పెనుమాక గ్రామంలో సుగాలి తండాకు చెందిన తండ్రి, కూతుళ్లకు జూలై నెల 1న ఇంటికి వెళ్లి సీఎం చంద్రబాబు పెన్షన్ ఇవ్వనున్నారు. పెనుమాక గ్రామానికి చెందిన ఇస్లావత్ సాయికి ఒంటరి మహిళా పెన్షన్ కింద పెంచిన రూ.1000తో కలిపి రూ.4000 వేలు ఏప్రిల్, మే, జూన్‌లో పెంచిన పెన్షన్ రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7వేలు స్వయంగా అందించనున్నారు. ఆమె తండ్రి బానావత్ పాములుకు పెంచిన వెయ్యి రూపాయిలతో కలిపి రూ. 4 వేలు ఏప్రిల్, మే, జూన్ నెలలను కలిపి మొత్తం మొత్తంగా రూ.7 వేలు స్వయంగా అందజేస్తారు. కాసేపు బానావత్ పాముల ఇంటి వద్దే ఉండి అక్కడ నుంచి అంగన్వాడీ కేంద్రానికి కాలినడకన చేరుకోనున్నారు. అంగన్వాడీ కేంద్రం ముందున్న చెట్టు వద్ద నిలబడి గ్రామస్థులతో ముఖాముఖిలో సీఎం చంద్రబాబు మాట్లాడనున్నారు. సీఎం గ్రామస్థులతో మాట్లాడే ప్రాంతానికి ప్రజావేదికగా నామకరణం చేశారు. ప్రజల సమస్యలు వినే ప్రజావేదికను మాజీ సీఎం జగన్ కూల్చేసిన విషయం తెలిసిందే. పెనుమాక గ్రామంలో ప్రజలతో మాట్లాడే ప్రాంతానికి ప్రజావేదికగా సీఎం చంద్రబాబు నాయుడు నామకరణం చేయనున్నారు.



# ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ

## 1ననే 90శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి

## బ్యాంకుల నుంచి ముందే నగదు తెప్పించుకోవాలి

## కలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్



అమరావతి, జూన్29 (ప్రజా మంటలు): జులై ఒకటో తేదీనే 90 శాతం పింఛన్లు పంపిణీ చేయాలని ఏపీ సీఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'జులై 1న 65,18,496 మందికి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయాలి. ఇందుకోసం రూ.4,399.89 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. పింఛన్ల పంపిణీ నిమిత్తం ఇతర ప్రభుత్వ విభాగాల సేవలను వినియోగించుకునేందుకు జిల్లా కలెక్టర్లు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలి. సోమవారం ఉదయం 6 గంటల కల్లా పింఛన్ల పంపిణీ ప్రారంభం కావాలి. జులై 1న 90 శాతానికి పైగా పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి. ప్రభుత్వం బ్యాంకులకు విడుదల చేసిన మొత్తాన్ని శనివారం రాత్రిలోగా అధికారులు విత్ డ్రా చేసుకోవాలి. ఏ బ్యాంకులోనైనా డబ్బులు శనివారం రాత్రి కల్లా ఇవ్వలేకుంటే.. అలాంటి బ్యాంకులు ఆదివారం తెరిచి సంబంధిత పింఛన్ల మొత్తాన్ని అందజేయాలని బ్యాంకు అధికారులకు సీఎస్ నీరభ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీపై సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్లతో శనివారం సీఎస్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పెన్షన్లకు సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. జూలై 1వ తేదీన 65 లక్షల 18వేల 496 మందికి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటింటి ఫించన్లు పంపిణీ చేయనున్నారు. పంపిణీకి సంబంధించి రూ.4 వేల 399.89 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఫించన్ల పంపిణీకి ఇతర ఫంక్షనరీల సేవలను కూడా వినియోగించుకునేందుకు జిల్లా కలెక్టర్లు ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. ఫించన్లు పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్లు గంట గంటకూ పర్యవేక్షించాలని ఆదేశించారు. సోమవారం ఉదయం 6గంటలకు పింఛన్లు పంపిణీ ప్రారంభం కావాలని సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.



# ఎయూ విసి, రిజిస్ట్రార్‌ల రాజీనామా

## వారి అక్రమాలపై విచారణకు విద్యార్థుల డిమాండ్

## క్యాంపస్‌లో పర్యటించిన ఎంపి సిఎం రమేశ్, ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం,జూన్29 (ప్రజా మంటలు): ఏయూలో చాలా అక్రమాలు, అన్యాయాలు జరిగాయని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. విసి ప్రసాద్ రెడ్డి రాజీనామా చేసినా వదిలేది లేదని, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రసాద్ రెడ్డి, రిజిస్టర్ జేమ్స్ స్టీఫెన్ రాజీనామాలతో యూనివర్సిటీలో విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. వైసీపీ సమయంలో చేసిన అక్రమాలపై, చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు డిమాండ్ చేశారు. శనివారం ఏయూలో ఎంపీ సీఎం రమేష్, గంటా శ్రీనివాసరావు, వెలగపూడి వంశీకృష్ణ యాదవ్ రాజీనామాలతో యూనివర్సిటీలో పర్యటించారు. ఉద్యోగులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. న్యాయపరమైన విచారణ చేయిస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయంలో రాజకీయాలు ఉండకూడదని అన్నారు. విశ్వవిద్యాలయంలో రాజకీయ నాయకుల విగ్రహాలు ఉండకూడదన్నారు. అధ్యాపకులు,విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకోని ముందుకు వెళ్తామని ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. దేశంలో ఎక్కడలేని విధంగా స్పెషల్ ఎగ్జామ్స్ నిర్వహించారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఏయూలో ప్రసాద్ రెడ్డి అనేక అవకతవకలకు పాల్పడ్డారన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రసాద్ రెడ్డి వలన ఇబ్బందులకు గురైన వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఏయూకు పూర్వవైభవం తీసుకువస్తామని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# బీహార్‌కు ప్రత్యేకహోదా ఇవ్వండి

## జెడియూ సమావేశంలో నేతల డిమాండ్

పట్నా,జూన్29(ప్రజా మంటలు): ఏపీలో అత్యధిక ఎంపీ సీట్లు సాధించిన టీడీపీ, ఇటు బిహార్‌లో గణనీయ సంఖ్యలో ఎంపీ స్థానాలు గెలుచుకున్న జేడీయూ సాయంతో మూడోసారి ఎన్డీయే పగ్గాలు చేపట్టింది. దీంతో ఏపీ సీఎం చంద్రబాబు, బిహార్ సీఎం నితీశ్ కుమార్ ప్రధాని మోదీ ముందు పెద్ద కోరికలే కోరే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చలు జరిగాయి. వీటిని నిజం చేస్తూ నితీశ్ కుమార్.. మోదీ ముందు భారీ డిమాండ్ ఉంచారు. అదే ప్రత్యేక హోదా. ఏపీలాగే ఎన్నో ఏళ్ల నుంచి బిహార్ కూడా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రత్యేక హోదా అడుగుతోంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో తాము కీలకంగా ఉన్నామని భావిస్తున్న జేడీయూ ఇదే అదనుగా భావిస్తూ ప్రత్యేక హోదా అంశాన్ని మళ్లీ తెరపైకి తెస్తోంది. బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) డిమాండ్ చేసింది. హోదా లేకుంటే ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని కోరింది. ఎన్డీయేలో భాగస్వామ్యంగా ఉన్న ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసింది. తీర్మానంలో రాష్ట్రం ఆర్థికంగా, అభివృద్ధిలో వెనుకబడి ఉండటాన్ని ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరమని, దీర్ఘకాలంగా ఉన్న ఈ డిమాండ్‌ను నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. దీంతోపాటు ఈ మధ్యే రిజర్వేషన్లను 65 శాతానికి పెంచిన కోటాను కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. న్యాయ పరిశీలన, రక్షణ కోసం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ కోటాను చేర్చాలని జేడీయూ ప్రతిపాదించింది. అలాగే ఈ కోటాను నిరంతరాయంగా అమలు చేస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చింది. ఇదే సమావేశంలో ఆ పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం సంజయ్ ఝాను నియమించారు. నితీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కోర్ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇవాళ జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో రెండు ముఖ్యమైన ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. అవి ఒకటి సంజయ్ ఝా నియామకం. రెండు జేడీయూ.. ఎన్డీయే కూటమిలోనే కొనసాగడం. ఈ నిర్ణయాలకు సభ్యులు ఆమోదం తెలిపారు.



# కేజ్రీవాల్‌ను విడిపించండి

## బిజెపి కార్యాలయం ముందు ఆప్ ధర్నా

న్యూఢిల్లీ,జూన్29 (ప్రజా మంటలు): ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని బీజేపీని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది. అందుకోసం శనివారం న్యూఢిల్లీలోని దిన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని బీజేపీ కేంద్ర కార్యాలయం ఎదుట ఆప్ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఆ క్రమంలో బీజేపీకి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశాయి. కావాలనే కక్షసాధింపుతో కేజ్రీవాల్‌ను జైలుకు పరిమితం చేశారని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సంస్థల దుర్వినియోగం, నియంత పాలన అంతం.. కోసం అంటూ పార్టీ శ్రేణులు ఈ సందర్భంగా ప్లకార్డులను ప్రదర్శించాయి. మరోవైపు బీజేపీ కేంద్ర కార్యాలయం వద్ద అనుమతి లేదంటూ ఆప్ పార్టీకి చెందిన ఆందోళనకారులను పోలీసులు నిలిపివేసే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలో స్థానికంగా కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇంకోవైపు కేజ్రీవాల్‌ను జైల్లోనే ఉంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుందని.. అందుకు అనుగుణంగా ఈడీ, సీబీఐ పరస్పరం సహకరించుకొంటున్నాయని ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సౌరబ్ ఈ రోజు ఉదయం ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ దేశవ్యాప్తంగా తన గొంతు వినిపిస్తుందని ఆయన స్పష్టం చేశారు. తీహాడ్ జైల్లో ఉన్న ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని ఆ పార్టీ ఇటీవల పిలుపు నిచ్చిన సంగతి తెలిసిందే.



# చైనా సరిహద్దుల్లో విషాదకర ఘటన

## వరద ఉధృతికి కొట్టుకు పోయిన ట్యాంక్

## ట్యాంక్‌తో సహ కొట్టుకు పోయిన ఐదుగగురు జవాన్లు

## ఆకస్మిక వరదలే కారణమని రక్షణ శాఖ వెల్లడి

## తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన రాజ్‌నాథ్ సింగ్

లద్దాఖ్,జూన్29 (ప్రజా మంటలు): చైనా సరిహద్దుల్లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్ లోని వాస్తవాధీన రేఖ సమీపంలో గల న్యోమా–చుషుల్ ప్రాంతంలో భారత సైన్యం విన్యాసాలు చేస్తుండగా ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. లేహ్‌కు 148 కిలోమీటర్ల దూరంలోని బోధి నదిలో శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విన్యాసాల్లో భాగంగా యుద్ధ ట్యాంక్‌లతో నదిని దాటుతుండగా ఈ వరదలు సంభవించాయి. దీంతో నదిలో నీటి ఉధృతి పెరిగి టీ–72 ట్యాంక్ మునిగిపోయింది. అందులోని ఐదుగురు జవాన్లు నదిలో కొట్టుకుపోయారు. అప్రమత్తమైన సైన్యం వెంటనే సహాయక చర్యలు చేపట్టింది. జవాన్ల కోసం నదిలో గాలించింది. అయితే, దురదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో వారంతా ప్రాణాలు కోల్పోయినట్లు రక్షణశాఖ అధికారులు వెల్లడించారు. ఐదుగురి మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. మృతుల్లో జూనియర్ కమిషన్డ్ అధికారి కూడా ఉన్నారు. ప్రమాదంపై కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ట్యాంక్‌తో నదిని దాటుతుండగా జరిగిన దురదృష్టకర ఘటనలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోవడం విచారకరం. దేశం కోసం మన సైనికుల అపార సేవను ఎప్పటికీ మర్చిపోలేం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఈ క్లిష్ట సమయంలో యావత్ దేశం వారికి అండగా నిలుస్తుందని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com